## విద్యుత్ షాక్‌తో రైతు మృతి



**ప్రజాపక్షం/వీర్నపల్లి:** విద్యుత్ షాక్ తో రైతు మృతి చెందిన సంఘటన వీర్నపల్లి మండల కేంద్రంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం 54 ఏళ్ల అంజయ్య అనే రైతు సోమవారం తన పంట పొలానికి వెళ్లి ప్రమాద వశాత్తు విద్యుత్ షాక్ కి గురయ్యాడని కొందరు, గుండెపోటుతో విద్యుత్ వైరు పై పడి మరణించి ఉంటాదని మరికొందరు తెలుపగా, అటుగా వెళ్లిన కొందరు రైతులు కొన ఊపిరితో ఉన్నాడని అంబులెన్స్‌కు సమాచారం అందించామని, అప్పటికే అంజయ్య మృతి చెందాడని 108 సిబ్బంది నిర్ధారించినట్లు తెలిపారు. ఈ సంఘటనతో మండలంలో ఒక్కసారిగా విషాద చాయలు అలుముకున్నాయి. మృతిడికి భార్య పుష్పలత, కుమారుడు జీవన్, కుమార్తెలు మౌనిక, అన్నపూర్ణ, అనిత లు ఉన్నారు. మృతుడు అంజయ్య గతంలో జనశక్తి పార్టీలో మిలిటెంట్‌గా పని చేసి, పోలీసులకు లొంగిపోయిన అనంతరం సిపిఐ రైతు విభాగం జిల్లా కార్యదర్శిగా పని చేస్తున్నాడు. సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఏరియా ఆసుపత్రికి తరలించామని ఎస్ఐ లక్ష్మణ్ తెలిపారు.


# ప్రజాపక్షం
## జిల్లా అనుబంధం
కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి

మంగళవారం | 31 మార్చి, 2026 | పేజీలు :08


# ప్రజావాణి అర్జీలపై తక్షణ పరిష్కారానికి కలెక్టర్ ఆదేశం



**ప్రజాపక్షం/కరీంనగర్:** ప్రజావాణి అర్జీలపై విచారణ జరిపి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా ఆదేశించారు. ప్రజావాణి దరఖాస్తులపై నిర్లక్ష్యం వహించవద్దని పేర్కొన్నారు. సోమవారం కరీంనగర్ జిల్లా కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతులను జిల్లా కలెక్టర్ స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా మాట్లాడుతూ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి కి వస్తారని, ఫిర్యాదులపై ఆయా శాఖల అధికారులు సానుకూలంగా స్పందించి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అర్జీలను పెండింగ్లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో 225 ఫిర్యాదులు వినతులు వచ్చాయి. సంబంధిత అధికారులు పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వృద్ధుల వద్దకే స్వయంగా జిల్లా కలెక్టర్ వెళ్లి వినతి పత్రాలను స్వీకరించారు. యోగక్షేమాలను అడిగి తెలుసుకుని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. సమస్యలను ఆలకించి తక్షణం పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, లక్ష్మి కిరణ్, ఆర్డీవో కే.మహేశ్వర్, డిఆర్డీఓ శ్రీధర్, గృహ నిర్మాణశాఖ పిడి శ్రీనివాసు అధికారులు పాల్గొన్నారు.

**అర్జీలను ప్రాధాన్యతగా పరిష్కరిస్తున్నాం మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్**

నగరపాలక సంస్థ ప్రజావాణిలో ప్రజల నుండి వివిధ సమస్యల పై వస్తున్న ధరఖాస్తులను ప్రాధాన్యతగా పరిష్కరిస్తున్నామని కమీషనర్ ప్రఫుల్ దేశాయ్ అన్నారు. సోమవారం కరీంనగర్ నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో ప్రజావాణీ కార్యక్రమం జరిగింది. కమీషనర్ ప్రఫుల్ దేశాయ్ ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు. నగరపాలక సంస్థ పలు విభాగాల వారిగా మొత్తం 22 దరఖాస్తులు రావడం జరిగింది. ఇందులో ఇంజనీరింగ్ విభాగంకు సంబంధించి 4, టౌన్ ప్లానింగ్ 8, ఇందిరమ్మ 2, సానిటేషన్ 2, రెవెన్యూ 4, పెన్షన్ 2 చొప్పున మొత్తం 22 దరఖాస్తులు రావడం జరిగింది. దరఖాస్తుల పరిష్కరించేలా సెక్షన్ల వారిగా అధికారులకు కమీషనర్ ప్రఫుల్ దేశాయ్ ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ప్రజావాణీ లో వచ్చిన దరఖాస్తులను క్షేత్ర స్తాయిలో విచారించి సమస్యలను త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. దరఖాస్తులను పెండింగ్ లేకుండా చూడలేని... ఇచ్చిన దరఖాస్తుల పై ప్రజలకు పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. ఈ ప్రజావాణి లో డిప్యూటీ కమీషనర్ ఖాధర్ మొహియుద్దీన్, ఈఈ సంజీవ్ కుమార్, ఎంహెచ్ఓ సుమన్, తదితరులు పాల్గొన్నారు.

## సారంగాపూర్ మండలంలో
# మాజీ మంత్రి జీవన్ రెడ్డి పర్యటన



**ప్రజాపక్షం/సారంగాపూర్:** మాజీ మంత్రి టి. జీవన్ రెడ్డి సోమవారం సారంగాపూర్ మండలంలో పర్యటించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో వారు మాట్లాడుతూ సాగునీటి సౌకర్యం మెరుగుపరచాలనే భావనతో ఉమ్మడి రాష్ట్రంలో 2004లో ఉమ్మడి రాష్ట్రంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తదుపరి ఎస్సారెస్పీ దిగువన కడెం ప్రాజెక్టు నీటిని నిలువరిపజేసే విధంగా ఎల్లంపల్లి ప్రాజెక్టు నిర్మాణం చేపట్టడం దానితో పాటుగా తుమ్మిడిహట్టి నుండి ప్రాణహిత నది జలాలను పొందే విధంగా 152 మీటర్ లెవల్ లో బ్యారేజ్ నిర్మాణం చేయాలనుకోవడం జరిగిందని గుర్తు చేశారు. దానికి అనుగుణంగా కాలువలు కూడా తవ్వకం జరిగిందన్నారు. తదుపరి ఎన్నికలు రావడం రాజశేఖర్ రెడ్డి తిరిగి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పటికి ఆకస్మిక మరణం తదుపరి మహారాష్ట్ర ప్రభుత్వం బ్యారేజి నిర్మాణ లెవల్ 152 మీటర్స్‌కు అభ్యంతరాలు తెలపడం అది పురోగతి నిలిచిపోయిందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తదుపరి టిఆర్ఎస్ ప్రభుత్వం ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన కేసిఆర్ మహారాష్ట్ర ప్రభుత్వంతో చేపట్టిన చర్చల ఫలితం 152 లెవల్ మీటర్స్ తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజి నిర్మాణం చేయాలని తలచడం జరిగిందో దానిని 148 మీటర్లకు కుదించే విధంగా దానితో పాటుగా దిగువ 100 మీటర్ల లెవల్ లో మేడిగడ్డ వద్ద దానికి ప్రతిగా ఇంకో బ్యారేజి నిర్మాణం చేపట్టారని తెలిపారు. అది మేడిగడ్డ నుండి అన్నారానికి ఎత్తిపోయడం జరిగిందన్నారు. సుందిళ్ల కు ఎత్తిపోయడం సుందిళ్ల నుండి ఎల్లంపల్లికి ఎత్తిపోసే విధంగా కాళేశ్వరం ప్రాజెక్టు డిజైన్ రుపొందించి మూడు బ్యారేజిలు నిర్మాణం చేపట్టడం ఈ మూడు ఎత్తిపోతల పథకాలు అమల్లోకి వచ్చాయని అన్నారు. ఈ కార్యక్రమంలో బీర్పూర్ మాజీ ఎంపిపి రమేష్, రామచంద్రారెడ్డి, ఆకుల రాజిరెడ్డి, చేకూట శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల ఆరోగ్య సంరక్షణకు
# ప్రత్యేక చర్యలు:కలెక్టర్

### కెజిబివిలు, టిజిఎంఎస్ రెసిడెన్షియల్ విద్యాలయాలు, హాస్టళ్లకు 20 ఫ్రీజర్ల పంపిణీ

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** విద్యార్థుల ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. జిల్లా అధికార యంత్రాంగం ఆధ్వర్యంలో జిల్లాలోని జిల్లాలోని 13 కేజీబీవీలు, ఏడు టీజీఎంఎస్ హాస్టళ్లకు కలిపి 20 ఫ్రీజర్లు కలెక్టర్ గరిమ అగ్రవాల్ ప్రత్యేక చొరవతో సమకూర్చారు. ఈ సందర్భంగా జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సోమవారం ఆయా విద్యాలయాల బాధ్యులకు కలెక్టర్ సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. విద్యార్థుల ఆరోగ్య సంరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని తెలిపారు. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందిస్తుందని వివరించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా జిల్లాలోని విద్యాలయాల విద్యార్థులకు వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య నిపుణులతో వైద్య పరీక్షలు, సేవలు అందిస్తుందని తెలిపారు. జిల్లాలోని రెసిడెన్షియల్ విద్యాలయాలు, హాస్టళ్లకు గత చలికాలంలో విద్యార్థులకు వేడి నీళ్లు అందించేందుకు ఇప్పటికే గీజర్లు అందించామని గుర్తు చేశారు. విద్యార్థులకు పరిశుభ్రమైన ఆహార పదార్థాలను అందించేందుకు ఫ్రీజర్లు ఈరోజు ఆయా రెసిడెన్షియల్ విద్యాలయాలు, హాస్టళ్ల బాధ్యులకు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి జగన్ మోహన్ రెడ్డి, పద్మజ, ఆఫీసర్స్, కేర్ పాల్గొన్నారు.



# అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలని, ప్రజావాణి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి అర్జీలను పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమం సందర్భంగా అదనపు కలెక్టర్ డి.వేణు తో కలిసి సమీకృత జిల్లా కలెక్టరేట్ లో ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు.పెద్దపల్లి మండలం రంగా పూర్ గ్రామానికి చెందిన గంద రాజయ్య గ్రామంలో తనకు ఎకరం 5 గుంటల వ్యవసాయ భూమి ఉందని,బ్రిక్స్ నుంచి వచ్చే దుమ్ము ధూళి బూడిద వల్ల తన పొలంలో పండే కూరగాయల పంటకు నష్టం వస్తుందని, బ్రిక్స్ పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా తహసిల్దార్ పెద్దపల్లి కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. సుల్తానాబాద్ మండలం నీరుకుల గ్రామానికి చెందిన ఎర్రబెల్లి రాజేశ్వర రావు గ్రామ శివారు సర్వే నెంబర్ 330 నుంచి 331 లో గల కాలువలో మట్టి తీయాలని కోరుతూ



దరఖాస్తు చేసుకోగా ఈఈ ఇరిగేషన్ అధికారి కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ప్రజావాణి కార్యక్రమంలో సంబంధిత జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



**ప్రజాపక్షం/ముత్తారం :** చట్టాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని ఆర్ ఐ నరీన్ సాయి అన్నారు. సోమవారం పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం పోతారం ప్రభుత్వ పాఠశాల ఆవరణంలో సర్పంచ్ ఉట్ల చరణ్ అధ్యక్షతన సివిల్ రైట్ డే నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అపరిచితుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్‌ను పట్టించుకోవద్దని అన్నారు. అనంతరం వివిధ అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఐ నరీన్ సాయి, రాజబాబు, జి.పి.ఓ లు భాస్కర్, కరుణాకర్, పోలీస్ సిబ్బంది వెంకటరెడ్డి తో పాటు తదితరులు ఉన్నారు.

## సబ్ స్టేషన్‌లో విద్యుత్ సామర్థ్యం పెంపు

ప్రజాపక్షం /ముస్తాబాద్ : ముస్తాబాద్ మండలంలోని ముస్తాబాద్ పట్టణం లో ఉన్న 33/11 KV సబ్ స్టేషన్ లో ఉన్న 5 MVA పవర్ ట్రాన్స్ఫార్మర్ తో పాట్టు మరొక్క 5MVA కెపాసిటీ గల పవర్ ట్రాన్స్ఫారంను ఏర్పాటు చేస్తున్నట్లు ముస్తాబాద్ సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి తెలిపారు. ఈ విద్యుత్ సామర్థ్యం ఏర్పాటుకు చాలా కాలం గా ప్రయత్నాలు చేశామని. ఇప్పుడు ఏర్పడు కావడంతో విద్యుత్ లోడు అధిక వోల్టేజ్ సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు.

## కాచాపూర్‌లో పౌర హక్కుల దినోత్సం

**ప్రజాపక్షం/శంకరపట్నం:** సమాజంలో ఎవరి హక్కులకూ భంగం కల్గించొద్దని ఎస్ఐ శేఖర్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని కాచాపూర్ గ్రామంలో సోమవారం పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంటరానితనం,అస్పృశ్యత,కుల వివక్ష నిర్మూలపై ప్రజలకు అధికారులు అవగాహన కల్పించారు.గ్రామంలో ఎలాంటి వివక్ష అంటరానితనం అస్పృశ్యత లేదని అందరూ అన్నదమ్ముల వలే కలిసిమెలిసి ఉంటామని గ్రామ సర్పంచ్ ఊకంటి మాధవి మధుకర్ పేర్కొన్నారు.పౌర హక్కులకు భంగం కలిగించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీవో ప్రభాకర్,ఆర్ఐ రాములు,హుజురాబాద్ మార్కెట్ కమిటి చైర్మెన్ నాంపల్లి తిరుపతి,టిఎవైఎస్ మండల అధ్యక్షుడు ఓదెలు,కోడూరి సమ్మయ్య,దామెర అశోక్,ఉప సర్పంచ్ లింగంపల్లి కృష్ణారెడ్డి,వార్డు మెంబర్లు లలిత, స్వరూప, శంకర్, శ్రీనివాస్,పాల్గొన్నారు.

## అవగాహన తోనే రోడ్డు ప్రమాదాలకు చెక్



**ప్రజాపక్షం/కరీంనగర్:** రోడ్డు ప్రమాదాల నివారణ కేవలం పోలీసుల చర్యల తోనే సాధ్యం కాదని, వాహనదారులు ట్రాఫిక్ నిబంధనల పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండి, వాటిని బాధ్యతాయుతంగా పాటించినప్పుడే ప్రమాద రహిత సమాజం సాధ్యమవుతుందని కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం అన్నారు. సోమవారం కరీంనగర్ ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో, ఆటో డ్రైవర్లు మరియు రాపిడో కెప్టెన్ల కోసం స్థానిక అస్త కన్వెన్షన్ హాలునందు ఏర్పాటు చేసిన అరైవ్ అలైవ్ మూడవ దశ అవగాహనా కార్యక్రమానికి సీపీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గత ఏడాది కమిషనరేట్ పరిధిలో రోడ్డు ప్రమాదాల వల్ల 200 మంది ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని సీపీ ఆవేదన వ్యక్తం చేశారు. హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించకపోవడం, అతివేగం, మద్యం సేవించి వాహనం నడపడం వంటి అజాగ్రత్తల వల్లే ఎక్కువ మరణాలు సంభవిస్తున్నాయని తెలిపారు. ప్రమాదాల్లో మరణించిన వారిలో 85 శాతం మంది పురుషులే ఉండటం గమనార్హమని, ఒక వ్యక్తి మరణం ఆ కుటుంబం మొత్తాన్ని వీధిన పడేస్తుందని గుర్తు చేశారు. ప్రతి డ్రైవర్ పరిసరాలను గమనిస్తూ వాహనం నడిపే 'డిఫెన్సివ్ డ్రైవింగ్' పద్ధతిని అలవరచుకోవాలని సూచించారు. మెడికవర్ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ లోకేష్ బృందం ప్రమాద సమయంలో ప్రాణాలు కాపాడే సిపిఆర్ విధానంపై డ్రైవర్లకు ప్రత్యక్ష ప్రదర్శన ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ వెంకటరమణతో పాటు, ట్రాఫిక్ ఏసీపీ యాదగిరి స్వామి , ఇన్స్పెక్టర్లు సంజీవ్ , కుమార స్వామి , కిరణ్ కుమార్, మెడికవర్ ఆసుపత్రి డాక్టర్ లోకేష్, రాపిడో అసోసియేట్ మేనేజర్ దుర్గా రావు ఇతర అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## అధికారికి ఉద్యోగ విరమణ సన్మానం



**ప్రజాపక్షం/అంతర్గాం:** పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండల పరిషత్ కార్యాలయంలో పర్యవేక్షణాధికారిగా పనిచేస్తున్న మామిడాల కరుణాకర్ మంగళవారం ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఈ మేరకు సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడివో జి.తిరుపతి ఆధ్వర్యంలో కరుణాకర్‌ను అధికారులు, కార్యాలయ సిబ్బంది ఘనంగా సన్మానించారు. 38 ఏళ్ల పాటు సుదీర్ఘ సేవలు అందించిన కరుణాకర్‌ను జడ్పీ సీఈవో కె.నరేందర్, జిల్లా పంచాయతీ అధికారి వీర బుచ్చయ్యలు ప్రత్యేకంగా అభినందించారు. ఎంపిడివోల సంఘం జిల్లా అధ్యక్షులు దివ్యదర్శన్‌రావు, జిల్లా ఎంపివోల సంఘం అధ్యక్షులు అనిల్‌రెడ్డి, తెలంగాణ పద్మశాలి ఉద్యోగ సంఘం ప్రతినిధులు శాలువాలతో కరుణాకర్‌ను సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి ఉద్యోగ సంఘం జిల్లా అధ్యక్షులు కొలిపాక సారయ్య, ప్రధాన కార్యదర్శి పరికి పండ్ల కోటేశం, ఉపాధ్యక్షులు బండి శ్రీనివాస్, ప్రచార కార్యదర్శి పెండెం సత్యనారాయణ, ఆర్గనైజింగ్ సెక్రటరి కుడిక్యాల హరీష్‌లు పాల్గొన్నారు.

## అంగన్వాడీ సెంటర్‌లో ప్రీ స్కూల్ మేళా



**ప్రజాపక్షం/కరీంనగర్:** ప్రజా పాలనా ప్రగతి ప్రణాళిక లొ భాగంగా కోతిరాంపూర్ అంగన్వాడీ సెంటర్ లో ప్రీ స్కూల్ మేళా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి గా ఆర్డీవో మహేశ్వర్, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, సిడిపివో సబితా, 39 డివిజన్ కార్పొరేటర్ మాసం గణేష్, 9 డివిజన్ కార్పొరేటర్ పొడిశెట్టి వసంతలక్ష్మి భూమయ్య జ్యోతి ప్రజ్వలన చేశారు. ఆర్డీవో మహేశ్వర్ మాట్లాడుతూ ప్రైవేట్ స్కూల్లు దీటుగా అంగన్వాడీ స్కూల్ పనిచేస్తున్నాయన్నారు. ఆట పాటలతో విద్య ను బోధించడం జరుగుతుందన్నారు.జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి మాట్లాడుతూ గర్భవత్తులు బాలింతలు అంగన్వాడీ సెంటర్ లొ లభించే పౌష్టికహారం బాలామృతం తీసుకోవాలని సూచించారు. సీడీపీఓ సబితా మాట్లాడుతూ ప్రీ స్కూల్ ప్రాధాన్యత, మొదటి 1000 రోజుల లో తీసుకోవాల్సిన జాగ్రత్త, పోషకహారం గురించి తల్లులకు అవగాహనా కల్పించారు. పి అండ్ జి ప్రథం మాస్టర్ ట్రయినర్ రాజేందర్ పిల్లలకు ఐదు అభివృద్ధి ల పైన ఆటలు ఆడించారు. దాదాపు 200 మంది పిల్లలు ఆటలు, పాటలు, కథ, సంభాషణ, పూర్వ గణిత భావనలు తల్లి తండ్రులను మంత్ర ముగ్ధలను చేశాయి. భాష, మేధా, సాంఘిక అభివృద్ధి, సృజనాత్మకత గురించి పిల్లలకు వివరిస్తూ వారికి రిపోర్ట్ కార్డు సీడీపీఓ సబితా సూపర్ వైజర్ అరుణ నిర్మల రేణుక చేతుల మీద అందించడం జరిగింది. ప్రీస్కూల్ వస్తువుల ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమం లో సతీష్, టీచర్స్ స్వరూప, శ్యామల, సరిత, పిల్లలు తల్లిదండ్రులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రజావాణికి 205 దరఖాస్తుల రాక

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** ప్రజావాణిలో అర్జీలు కలెక్టర్ గరిమ అగ్రవాల్ స్వీకరించి.. పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సోమవారం ప్రజావాణి నిర్వహించి.. ప్రజల నుంచి కలెక్టర్ అర్జీలు స్వీకరించారు. మొత్తం 205 అర్జీలు రాగా, ఆయా శాఖల అధికారులకు అందజేశారు. రెవెన్యూ శాఖకు 82, గృహ నిర్మాణ శాఖకు 35, డీఆర్డీఓకు – 30, జిల్లా పంచాయతీ కార్యాలయానికి 9, ఉపాధి కల్పన అధికారికి 8, మున్సిపల్ కమిషనర్ సిరిసిల్ల, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, ఎస్పీ కార్యాలయానికి ఐదు చొప్పున, జిల్లా పంచాయతీ అధికారి, జిల్లా సంక్షేమ అధికారి – 4, జిల్లా పౌర సరఫరాల శాఖ, జిల్లా వైద్యాధికారి, నీటి పారుదల శాఖ అధికారికి మూడు చొప్పున, జిల్లా పంచాయతీ రాజ్ ఇంజనీర్, డీఎం ఆర్టీసీ సిరిసిల్ల, సెస్ ఎండీకి రెండు చొప్పున, మెప్మా కార్యాలయానికి ఒకటి చొప్పున రాగా.. వాటిని సంబంధిత కార్యాలయాలకు పంపించారు. ప్రజావాణిలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, సిరిసిల్ల, వేములవాడ ఆర్డీఓలు వెంకటేశ్వర్లు, రాధాబాయ్, వెంకట మాధవ రావు పాల్గొన్నారు.

## చేతి పంపులకు మరమ్మతులు

**ప్రజాపక్షం/ముత్తారం :** పెద్దపల్లి ముత్తారం మండలం అడవి శ్రీరాంపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని అబ్రాబాద్ లోఆది వారం చెడిపోయిన చేతి పంపులను సర్పంచ్ బోంతల అన్నపూర్ణ ఉపేందర్ ఆధ్వర్యంలో పంపు రిపేరర్ అఫ్జల్ తో మరమ్మతులు చేపట్టారు. చేతి పంపులు పనిచేయక గ్రామస్తులు నీటి సరఫరాకు అనేక ఇబ్బందులు పడుతున్నారు. దీంతో సర్పంచ్ అన్నపూర్ణ ఉపేందర్ స్పందించి చేతి పంపులను బాగుచేయించారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ అనవేన హరిత తిరుపతి, వార్డు సభ్యులు తో పాటు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ సిబ్బందితో పాటు గ్రామస్తులున్నారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ

**ప్రజాపక్షం/ముస్తాబాద్:** ముస్తాబాద్ మండలం నామాపూర్ గ్రామంలో సర్పంచ్ మదాసు అనిల్ మరియు కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు గన్నే భాను రెడ్డి ఆధ్వర్యంలో పలువురు లబ్ధిదారులకు సుమారు 1,27,000 రూపాలు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. సీఎం సహాయ నిధి పేదలకు వరంగా మారిందని సర్పంచ్ మదాసు అనిల్ అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు గన్నే భాను రెడ్డి , మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వెలుముల రామ్ రెడ్డి,డికొండ దశరథం, గుండవేణి కుమార్, మెరుగు శివ మరియు కొట్టూరి నవీన్ గూడ విజయ్ రెడ్డి, నారాయణ తదితరులు ఉన్నారు.

## దొంగతనాలు జరగకుండా అలారం లాక్ ఏర్పాటు

**ప్రజాపక్షం/ముస్తాబాద్:** ముస్తాబాద్ మండలం తెర్లుమద్ది గ్రామంలోని హనుమాన్ దేవాలయానికి గ్రామ సర్పంచ్ బైతి దుర్గమ్మ నవీన్ సహకారంతో అల్లారం లాక్ ఏర్పాటు చేశారు. గ్రామంలో టెంపుల్స్ కు వివిధ కుల సంఘాలతో కలిపిమొత్తం 8 అలారం లాక్ ఏర్పాటు చేసి, స్థానిక ఎస్సై గణేష్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇదేవిధంగా అన్ని గ్రామాల ప్రజలు జాగ్రత్తల గురించి ఆలోచించి, ఎలాంటి దొంగతనాలకు జరగకుండా అల్లారం లాకులు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు . ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్, ఎస్సై గణేష్ తెర్లుమద్ది గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## గ్రోమోర్ నూతన కేంద్రం ప్రారంభం

**ప్రజాపక్షం/వీర్నపల్లి:** మండల కేంద్రంలోని గ్రోమోర్ నూతన కేంద్రంను సెస్ డైరెక్టర్ మల్లేశం, మాజీ ఎంపీటీసీ అరుణ్ కుమార్, ఉప సర్పంచ్ నరేష్, మాజీ ఏఎంసీ చైర్మన్ గుజ్జుల రాజిరెడ్డి గ్రోమోర్ సెంటర్ నిర్వాహకులతో కలిసి సోమవారం ప్రారంభించారు. మండలంలోని రైతులు అందరు గ్రోమోర్ సంస్థ అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా వారు తెలిపారు. గ్రోమోర్ సంస్థ ఆర్ఎస్ఎం లు రైతులకు డ్రోన్ సేవలు, భూసార పరీక్షలు, ఆధునిక వ్యవసాయ పద్ధతుల వలన లాభాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎం లు దేవయ్య, అశోక్, అనిల్, వైకుంఠం, ప్రమోద్, వీర్నపల్లి గ్రోమోర్ సెంటర్ నిర్వహకులు మహిపాల్, దినకర్, సాయి, మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

# స్త్రీనిధి అవార్డులు సాధించిన అధికారులకు అభినందనలు

ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ : హైదరాబాద్‌లో నిర్వహించిన స్త్రీనిధి 13వ జనరల్ బాడీ సమావేశంలో రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి అవార్డులు సాధించిన సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అవార్డు గ్రహీతలను ప్రత్యేకంగా అభినందించారు.శనివారం హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో రాష్ట్ర పంచాయతీరాజ్ & గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి సీతక్క, సీఈఓ ఎండీ దివ్య దేవరాజన్ చేతుల మీదుగా పెద్దపల్లి జిల్లాకు స్త్రీనిధి అవార్డులు ప్రదానం చేయబడిన విషయం తెలిసిందే.ఈ సందర్భంగా సోమవారం జిల్లా కలెక్టర్ తన చాంబర్‌లో అవార్డు గ్రహీతలను అభినందించారు.మున్సిపల్ పరిధిలో రుణాల పంపిణీ, వసూళ్లలో అగ్రస్థానంలో నిలిచినందుకు జె. అరుణ శ్రీ, జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ & అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ప్రతిభా పురస్కారం అందుకున్నారు.గ్రామీణ ప్రాంతాల్లో స్త్రీనిధి కార్యక్రమాల విజయవంతమైన అమలుకు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారి శ్రీమతి ఎం. కాళిందిని గారు పురస్కారం అందుకున్నారు.అలాగే క్షేత్ర స్థాయి సిబ్బంది ఇదే ఉత్సాహంతో పనిచేసి మరింత మెరుగైన ఫలితాలు



సాధించాలని సూచించారు.అనంతరం మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో పూర్తి సహకారం అందించినందుకు కలెక్టర్ ను మున్సిపల్ కమిషనర్లు వెంకటేష్ , మనోహర్,రమేష్,లు కలిసి సత్కరించారు.

## ఆశా వర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనాలు ఇవ్వాలి

ప్రజాపక్షం/జగిత్యాల: ఆశా వర్కర్లకు రూ. 18 వేల ఫిక్స్‌డ్ వేతనాలు ఇవ్వాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని సిఐటియూ జిల్లా అధ్యక్షురాలు ఇందూరి సులోచన డిమాండ్ చేశారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సిఐటియూ ఆధ్వర్యంలో ఆశా వర్కర్లు సోమవారం జగిత్యాల జిల్లా కేంద్రంలో ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్త బస్టాండ్ చౌరస్తాలో రాస్తారోకో నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం సులోచన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయకపోవడంతో పాటు కార్మికుల హక్కులపై నిర్భందం పెంచుతున్నారన్నారు. సంఘటితంగా కార్మికులంతా పోరాడి హక్కుల కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షురాళ్లు బాదినపెల్లి ప్రేమలత, మామిడిపెల్లి జ్యోతి, సహాయ కార్యదర్శులు వసంత, భాగ్య, శ్రీవాణి, సుగుణ, వనిత, విజయ లక్ష్మి , రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి లెల్లల బాలకృష్ణ తదితరులు ఉన్నారు.

## మెట్‌పల్లి బార్ ఎన్నికలు

ప్రజాపక్షం/మెట్‌పల్లి : మెట్‌పల్లి బార్ అసోసియేషన్ ఎన్నికల్లో అధ్యక్షుడిగా ఏలేటి రామ్ రెడ్డి ఒక్క ఓటు తేడాతో విజయం సాధించారు. మొత్తం 159 ఓట్లలో 153 పోలవగా, రామ్ రెడ్డి 55 ఓట్లు పొందగా, లింబాద్రి స్వల్ప తేడాతో ఓడిపోయారు. అలాల సత్యనారాయణ44 ఓట్లతో మూడో స్థానంలో నిలిచారు. జాయింట్ సెక్రటరీగా మగ్గిడి నర్సయ్య కూడా ఒక్క ఓటు తేడాతో గెలుపొందారు.ఉపాధ్యక్షురాలిగా మెడిచెల్మెల సుమలత,జనరల్ సెక్రటరీగా నల్లా రాజేందర్, కోశాధికారిగా బిగుల్లా శంకర్ ఎన్నికయ్యారు. ఇతర పదవుల్లో పలువురు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. విజేతలను జడ్జి డి. నాగేశ్వర్ రావు, జూనియర్ సివిల్ జడ్జి నారం అరుణ్ కుమార్ అభినందించారు.

## పోలీసుల అదుపులో మాజీ సర్పంచులు

ప్రజాపక్షం/పెగడపల్లి: గ్రామాల్లో చేసిన అభివృద్ధి పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ, రాష్ట్ర సర్పంచుల సంఘం పిలుపుమేరకు అసెంబ్లీ ముట్టడికి బయలుదేరిన సర్పంచులను, మాజీ సర్పంచులను పెగడపల్లి పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. మార్గమధ్యలో వారిని అడ్డుకున్న పోలీసులు బలవంతంగా పోలీస్ స్టేషన్‌కు తరలించారు.ఈ సందర్భంగా అరెస్టయిన సర్పంచులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి పనుల బిల్లులను కావాలనే తొక్కిపెడుతోందని ఆరోపించారు. సర్పంచులు రాచకొండ ఆనంద్,మాజీ సర్పంచులు ఉప్పులంచ లక్ష్మణ్, తిరుపతి, సాయిని రవీందర్,బాలుసాని శ్రీనివాస్, మల్లేశం ఉన్నారు.

## మాతా, శిశు ఆసుపత్రిలో మరొక క్లిష్టమైన శస్త్రచికిత్స విజయవంతం

ప్రజాపక్షం/పెద్దపల్లి : పెద్దపల్లి జిల్లాలోని మాతా శిశు ఆసుపత్రిలో సోమవారం రోజున మరో క్లిష్టమైన శస్త్ర చికిత్స విజయవంతం చేసినట్లు ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ కే శ్రీధర్ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ,బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన 45 సంవత్సరాల మహిళ తీవ్ర కడుపు నొప్పి మరియు అధిక రక్తస్రావంతో పెద్దపల్లి జిల్లా ఆసుపత్రికి వచ్చిందనీ, వైద్యులు సమగ్రంగా పరీక్షలు నిర్వహించగా, గర్భాశయంలో పెద్ద గడ్డ ఉన్నట్లు గుర్తించారు. ఆధునిక వైద్య పద్ధతిలో



హిస్టరెక్టమీ శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించి గడ్డను పూర్తిగా తొలగించడం జరిగింది.ఇట్టి సర్జరీ లో పాల్గొన్న వైద్యుల బృందం, గైనకాలజిస్ట్ డాక్టర్ అనసూయ మరియు అనేస్తేషియా డాక్టర్ రామం సర్జరీ విజయవంతం చేశారని తెలిపారు. ఈ సందర్భంగా వైద్య బృందంను OT సిబ్బందిని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె. శ్రీధర్ ప్రత్యేకంగా అభినందించారు. అదేవిధంగా ప్రజలందరూ పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో అందుతున్న నవజాత శిశు కేంద్రం సేవలు, 2 డి ఎకో సేవలు, ఆధునిక పరిజ్ఞానంతో కూడిన లాప్రోస్కోపిక్ శస్త్ర చికిత్సలు, యూరాలజీ సేవలు మరియు రూట్ కెనాల్ సేవలను ఉపయోగించుకోవాలని, వాష్ రూమ్ శుభ్రత గురించి గాని ఎవరైనా డబ్బులు అడిగినా గాని మరియు ఏ ఇతర సమస్య ఉన్నా కూడా నర్సింగ్ సూపరింటెండెంట్ ని, RMOని, నేరుగా సూపరింటెండెంట్ సంప్రదించాలని, లేదా ఫిర్యాదులను కంప్లైంట్ బాక్స్ లో ఇవ్వవచ్చనీ ,వారి సమస్యని వెంటనే పరిష్కారం చేయడానికి ప్రయత్నం చేస్తాం అని సూపరింటెండెంట్ డాక్టర్ కే శ్రీధర్ తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రి లో అన్ని రకముల సేవలు ఉచితం ఎవ్వరికి లంచం ఇవ్వరాదని తెలిపారు.

## డిమాండ్లు నెరవేర్చకుంటే చీకట్లోకి రాష్ట్రం

ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ : పెద్దపల్లి రూరల్: తెలంగాణ రాష్ట్ర విద్యుత్ రంగంలో పనిచేస్తున్న ఆర్టిజన్లు, ఆన్ మ్యాన్, మీటర్ రీడర్ల సమస్యల పట్ల విద్యుత్ యాజమాన్యం ప్రదర్శిస్తున్న ఉదాసీన వైఖరిపై కార్మిక లోకం భగ్గుమంటూ తెలంగాణ రాష్ట్ర విద్యుత్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు మేరకు తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం పోరాటాన్ని ఉధృతం చేశారు. గత మార్చి 26న నిర్వహించిన ఒక రోజు ధర్నాకు యాజమాన్యం నుండి ఎలాంటి స్పందన రాకపోవడంతో కార్మికులు మరోసారి భారీ నిరసన కార్యక్రమం చేపట్టరు.ఈ సందర్భంగా ఆర్టిజన్ జిల్లా చైర్మన్ మల్ల కిషన్ రెడ్డి,ఆన్ మ్యాన్ జిల్లా అధ్యక్షులు ఇరుగురాల రమేష్ మాట్లాడుతూ యాజమాన్యం తమ డిమాండ్లను వెంటనే అంగీకరించని యెడల ఏప్రిల్ 2న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని సర్కిల్ కార్యాలయాల ముందు వంట వార్పు కార్యక్రమాన్ని నిర్వహిస్తామని, అప్పటికి కూడా స్పందన లేని పక్షంలో ఏప్రిల్ 8 నుండి రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక సమ్మెకు వెళ్తామని యాజమాన్యానికి అల్టిమేటం జారీ చేశారు. ప్రధానంగా ఆర్టిజన్ల స్టాండింగ్ ఆర్డర్‌ను తక్షణమే రద్దు చేసి సర్వీస్ రూల్స్‌ను అమలు చేయాలని, ఆన్ మ్యాన్ కార్మికులను ఆర్టిజన్లుగా గుర్తించి వారిని విద్యుత్ సంస్థలో విలీనం చేసుకోవాలని, మీటర్ రీడర్లు, మిగిలిన పీస్ రేటు కార్మికులకు పూర్తి స్థాయిలో ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.ఈ ధర్నా కార్యక్రమంలో ఆర్టిజన్లు, ఆన్ మ్యాన్,స్పాట్ బిల్లర్లు, పీస్ రేటు కార్మికులు పాల్గొని నిరసన వ్యక్తం చేయగా అన్ని యూనియన్ల నాయకులు సంఘీభావం ప్రకటించారు.




## సంఘం అభివృద్ధికి సిఇఒ సంతోష్ సేవలు అభినందనీయం

ప్రజాపక్షం/సుల్తానాబాద్: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అభివృద్ధి చెందడంలో కార్యనిర్వాహన అధికారి సంతోష్ సేవలు ఎంతో అభినందనీయమని మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణ అన్నారు. సోమవారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సుల్తానాబాద్ ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ రైతుల అభివృద్ధి కోసం నిరంతరం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు కృషి చేస్తున్నాయని సుల్తానాబాద్ మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణ అన్నారు. సోమవారం స్థానిక పిఎసిఎస్ లో 132 వ సర్వ సభ్య సమావేశం యన్. వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించారు. తేది 01102025 నుండి 28032026 వరకు జరిగిన ఆదాయ, వ్యయాలను సంఘ కార్యదర్శి బూరుగు సంతోష్ సమావేశంలో చదివి వినిపించారు. 202627 సంవత్సరం అంచనా బడ్జెట్ ను సంఘ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. పలు అంశాలపై తీర్మానలను సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ



సుల్తానాబాద్ సొసైటీ వివిధ రకాల వ్యాపారాలను నిర్వహిస్తూ రైతులకు ప్రజలకు ఆదర్శంగా నిలుస్తుందని రైతులకు సంబంధించిన పూర్తి ఫెర్టిలైజర్ ఎరువులు అందుబాటులో ఉంచుతూ రైతులకు ఎల్లవేళలా సేవలందిస్తుందని అలాగే సూపర్ మార్కెట్ మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసి సేవలందిస్తుందని త్వరలో పెట్రోల్ పంప్ ప్రారంభించి రైతులకు మరింత చేరువ కానుందని అన్నారు.ఈ కార్యక్రమం లో మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ అంతటి పుష్పలత, మార్కెట్ కమిటీ వైస్ చేర్మెన్ ఉస్తేము గణేష్, రాజ మల్లయ్య, గరిగే శోభ రాణి,బావు రాజేందర్ మాజీ పాలక వర్గ సభ్యులు, మాజీ సర్పంచ్‌లు సంఘ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## భక్తులకు అసౌకర్యం కలగకుండా జయంతి ఏర్పాట్లు

ప్రజాపక్షం/మల్యాల : జగిత్యాల జిల్లా మల్యాల మండలం కొండగట్టు లో చిన్న హనుమాన్ జయంతి ఉత్సవాలు ఏప్రిల్ 1నుండి 3 రోజుల పాటు నిర్వహించనున్న నేపథ్యంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ తెలిపారు.సోమవారం ఆయన,జిల్లా ఎస్పీ అశోక్ కుమార్‌తో కలిసి కొండగట్టు ఆలయ పరిసరాల్లో ఉత్సవాల ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా భక్తుల సౌకర్యార్థం చేపడుతున్న ఏర్పాట్లను ప్రత్యక్షంగా సమీక్షించారు. ఉత్సవాలకు భారీ సంఖ్యలో దీక్ష పరులు, భక్తులు హాజరవుతారని భావించి ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. దేవాలయ పరిసర ప్రాంతాల్లో 64 సీసీ కెమెరాల తో భద్రతా ఏర్పాట్లు కట్టుదిట్టంగా ఉండేలా పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. హెల్ప్ లైన్ కేంద్రం తో పాటు 6 ప్రదేశాల్లో ప్రత్యేక ఆరోగ్య కేంద్రాలు, ఖాళీ స్థలాల్లో భక్తుల సౌకర్యార్థం తాత్కాలిక టెంట్లు, మెట్ల దారి మార్గంలో లైటింగ్ ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. పార్కింగ్ సదుపాయాలు సరిపడా ఉండేలా చూడాలని, ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక ప్రణాళిక అమలు చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి.రాజ గౌడ్,మధుసూదన్, డిపివో మదన్ మోహన్, ఆలయ ఏవో అంజనా రెడ్డి, ఎమ్మార్వోలు ,ఎంపిడివోలు,సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## నేరాల నియంత్రణలో సిసి కెమెరాల కీలక పాత్ర

ప్రజాపక్షం/మెట్‌పల్లి : ప్రస్తుత కాలంలో నేరాలను నియంత్రించడంలోనే కాకుండా, నేరస్థులను వేగంగా గుర్తించి పట్టుకోవడంలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని మెట్‌పల్లి డీఎస్పీ రాములు తెలిపారు.కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమంలో భాగంగా మెట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని 26వ వార్డులో కౌన్సిలర్ బొడ్ల రమేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 14 సీసీ కెమెరాలను డీఎస్పీ రాములు ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సీసీ కెమెరాలు పోలీసులకు శక్తివంతమైన సాధనంగా మారాయని అన్నారు. ఏదైనా నేరం జరిగినప్పుడు నిందితులను గుర్తించడంలో సీసీ కెమెరాల ఫుటేజ్ కీలకంగా ఉపయోగపడుతుందని తెలిపారు.గ్రామాల్లో జరిగే చిన్న సంఘటనల నుండి పెద్ద ఘటనల వరకు ప్రతి అంశాన్ని సీసీ కెమెరాల ద్వారా తక్షణమే గుర్తించే అవకాశం ఉందని చెప్పారు. పోలీసులకు ప్రజల సహకారం లభిస్తేనే శాంతి భద్రతలు మరింత బలపడతాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మెట్‌పల్లి సీఐ అనిల్, ఎస్ఐ కిరణ్ కుమార్, మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి.,వైస్ చైర్మన్ ఓంకార్ నవీన్,వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశం

ప్రజాపక్షం/పెగడపల్లి : మండల పరిధిలోని లింగాపూర్ గ్రామానికి చెందిన తరాల్ల వనజ శ్రీనివాస్ దంపతుల నూతన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశం సోమవారం అత్యంత వేడుకగా జరిగింది. ఈ కార్యక్రమానికి గ్రామ ప్రజాప్రతినిధులు, అధికారులు మరియు గ్రామ పెద్దలు హాజరై నూతన గృహస్తులను ఆశీర్వదించారు. ఈ శుభకార్యంలో సర్పంచ్ కాశెట్టి వీరేశం, ఉపసర్పంచ్ గజ్జి రమ తిరుపతి, పంచాయతీ కార్యదర్శి లావణ్య, వార్డు సభ్యులు రాధనవీన్, చెనల్ల గణేష్, తిరుపతి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, కురిక్యాల హనుమాన్ శేఖర్, సంధి మల్లారెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

## కొండగట్టు అంజన్న హుండీ ఆదాయం రూ.74లక్షల 74వేల 174

ప్రజాపక్షం/మల్యాల : జగిత్యాల జిల్లా మల్యాల మండలం ముత్యంపేట గ్రామం కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయానికి 74 లక్షల 74 వేల 174 రూపాయల ఆదాయం వచ్చిందని ఆలయ కార్య నిర్వహణ అధికారి అంజనరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారము లలిత సేవా ట్రస్ట్, ఆధ్వర్యంలో 38 రోజులకు 13 హుండీలు విప్పి లెక్కించగా ఈ ఆదాయము వచ్చిందన్నారు. హుండీలు లెక్కింపు చేయగా వచ్చిన బంగారం,మిశ్రమ వెండి, తిరిగి బ్యాగ్ లో వేసి సీల్ వేసి హుండీలో భద్రపరిచినట్లు వివరించారు. ఈ కార్యక్రమానికి కరీంనగర్ దేవాలయ శాఖ పరిశీలకులు సుప్రియ, రాజ గుండి హరిహరనాత్, ఆలయ ప్రధాన అర్చకులు రఘు, కపీందర్ అశోక్, ధర్మేందర్, ఆలయ సిబ్బంది, ఏ.ఎస్.ఐ, మహిళా కానిస్టేబుల్, హూంగార్డ్స్, బ్యాంక్ సిబ్బంది, సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా గ్రీవెన్స్‌డే

ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల : ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా, ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేయడం జరుగుతుందని జిల్లా ఎస్పీ మహేష్ బి.గీతే అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహించి అర్జీ దారుల నుండి 36 ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ప్రజల వద్ద నుండి ఫిర్యాదులు స్వీకరించి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా బాధితులకు సత్వర న్యాయం చేస్తున్నామన్నారు. ఫిర్యాదులు స్వీకరించి, ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ చేసి బాధితుల సమ



స్యలను చట్టపరంగా త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. పోలీస్ అధికారులు, సిబ్బంది పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించి, వినతులు, ఫిర్యాదులు స్వీకరించి, అవసరమైతే క్షేత్ర స్థాయిలో పరిశీలించి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. తద్వారా ఫిర్యాదుదారునికి పోలీస్ శాఖపై భరోసా, నమ్మకం కలుగుతుందన్నారు. గ్రీవెన్స్ డే లో వచ్చిన ఫిర్యాదులు ఆన్ లైన్ లో పొందుపరుస్తూ ఏ మేరకు పరిష్కారం అయ్యాయో ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలందించడం జరుగుతుందని అన్నారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని అన్నారు.

## ఆభయాంజనేయ స్వామి ఆలయంలో పూజలు

ప్రజాపక్షం/జగిత్యాల టౌన్ : జగిత్యాల జిల్లా కేంద్రంలోని అరవింద్ నగర్‌లో ఉన్న అభయాంజనేయ స్వామి ఆలయంలో మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ దంపతులు సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం 40వ వార్డులో పర్యటించి పారిశుద్ధ్య పనులతో పాటు పలు సంక్షేమ కార్యక్రమాల అమలు తీరును పర్యవేక్షించారు. మాజీ కౌన్సిలర్ వీరబత్తిని పద్మజ శ్రీనివాస్, ఆలయ కమిటీ సభ్యులు, నాయకులు తదితరులు ఉన్నారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉచిత ప్రత్యేక వైద్య శిబిరం

ప్రజాపక్షం /కథలాపూర్ : ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అంబారిపేట వైద్యాధికారి జి.రచన మాట్లాడుతూ తేదీ 31.03.2026, మంగళవారం రోజున అంబారిపేటలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉచిత ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించబడుతోందని ఈ శిబిరానికి ఈ క్రింది విభాగాలకు చెందిన ఆరుగురు ప్రముఖ వైద్య నిపుణులు విచ్చేసి వైద్య సేవలు అందించనున్నారని గైనకాలజీ,పెడియాట్రిక్ ,డెంటిస్ట్ ,ఆప్తల్మిక్ (కంటి వైద్య నిపుణులు), ఆర్థోపెడిక్ (ఎముకల వైద్య నిపుణులు),జనరల్ మెడిసిన్‌కావున ప్రజలు ఈ శిబిరానికి విచ్చేసి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

## ముందస్తు అరెస్టు పిరికిపంద చర్య

ప్రజాపక్షం/మల్లాపూర్:గతప్రభుత్వ హయాంలో చేసిన పనులకు బిల్లులు రాక ఇబ్బందులు ఎదుర్కొంటున్న మాజీ సర్పంచులను ప్రభుత్వం పోలీసులతో ముందస్తు అరెస్టు చేయించడం పిరికిపంద చర్యని మాజీ సర్పంచులు అన్నారు. తమకు ప్రభుత్వం నుండి రావాల్సిన బిల్లు తక్షణమే విడుదల చేయాలని విన్నవించుకున్న పట్టించుకోకపోవడంతో ఎక్కడ అసెంబ్లీ సమావేశాలు అడ్డుకుంటారని ముందు జాగ్రత్తతో అడ్డం పెట్టుకొని అరెస్టు చేయిస్తూ అడ్డుకోవడం ప్రభుత్వానికి సిగ్గు చేటని అన్నారు. అరెస్ట్ అయిన వారిలో సయ్యద్ హైదర్ మైదాన్ శ్రీనివాస్, గోవింద్ నాయక్ నాగరాజు, రామా గౌడ్ తదితరులున్నారు.

## జగిత్యాల అభివృద్ధి చేయడమే లక్ష్యం

ప్రజాపక్షం/జగిత్యాల టౌన్ :జగిత్యాల మున్సిపల్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే మా ప్రధాన లక్ష్యమని జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ సమిండ్ల వాణి శ్రీనివాస్ పేర్కొన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా సోమవారం ఖిలాగడ్డ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని చైర్ పర్సన్ ప్రారంభించి మాట్లాడారు.

## జనగామలో పౌర హక్కుల దినోత్సవం

ప్రజాపక్షం/పెద్దపల్లి :స్థానిక రామగుండం కార్పొరేషన్ జనగామ గ్రామం 6వ డివిజన్ లో రెవెన్యూ అధికారులు VRO సురేష్ ఆధ్వర్యంలో పౌర హక్కుల దినోత్సవం (సివిల్ రైట్స్ డే )ను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమం లో ముఖ్య అతిథులుగా పెద్దపల్లి జిల్లా SC & ST విజిలెన్స్ మానిటరీ కమిటీ సభ్యులు కవ్వంపెల్లి సతీష్ ,6వ డివిజన్ కార్పొరేటర్ తోకల శ్యామనిరమేష్ పాల్గొని అనంతరం వారు మాట్లాడుతూదళితులకు అందే ప్రభుత్వం పథకాలు, మరియు కుల వివక్షత,SC ST లకు చెందాల్సిన న్యాయపరమైన హక్కులు దళిత వాడ లల్లో జరిగే ప్రభుత్వ కార్యక్రమాలు, మరియు దేవాలయ సందర్శించిన సందర్భంగా దళితులకుఇబ్బందులు, వంటి వాటి పైన అవగాహన కల్పించారు.ఇంకా ఈ కార్యక్రమం లో టు టౌన్ పోలీస్ అధికారులు ASI తిరుపతి రెడ్డి, మున్సిపల్ వార్డు స్పెషల్ ఆఫీసర్ సంతోష్, బిల్లు కలెక్టర్ రవి కుమార్,గ్రామ పెద్దలు దళిత సంఘాల నాయకులు



అంబేద్కర్ సంఘం అధ్యక్షులు జనగామ రాయాలింగు, జనగామ బొద్దు మహేందర్, నేతకానీ సంఘం రాష్ట్ర నాయకులు ,గ్రామ పెద్దలు జువ్వాడి రామారావు, నడిపెల్లి గోపాల్ రావు, గ్రామ మాల సంఘం ఐత లక్ష్మయ్య, భీమా శంకర్, మేకల నాగరాజు, పంజా అశోక్ గ్రామ నాయకులు దా చక్రపాణి, జనగామ శివకుమార్ ,గుండబోయిన గట్టయ్య,సిద్ధ తిరుపతి,భీమా సాగర్,జనగామ సంతోష్,పారిపెల్లి భాగ్యరాజ్,ఇందూరి రాజన్న చారి,తదితరులు పాల్గొన్నారు.

## ఆశవర్కర్లకు 18 వేల వేతనం చెల్లించాలి

ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల : ఆశాలకు ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం 18 వేల రూపాయల ఫిక్స్ వేతనం నిర్ణయించి అసెంబ్లీలో తీర్మానం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి కోడం రమణ డిమాండ్ చేశారు. సోమవారం ఆశ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని సిరిసిల్ల అంబేద్కర్ చౌక్ లో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశంలో తీర్మానం చేసి ఆశ వర్కర్ల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని అన్నారు. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడడం కోసం తన ప్రాణాన్ని కూడా ఫణంగా పెట్టి పనిచేస్తున్న ఆశా వర్కర్ల పై నిర్లక్ష్యం వీడాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ఆశా వర్కర్లకు పనివారం తగ్గించి ఫిక్స్ వేయత్నం చెల్లిస్తానన్న మాట ఏమైందని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 27 నెలలు గడుస్తున్న ఏ ఒక్క హామీ నెరవేర్చకుండా ఆశ వర్కర్లను నిరుత్సాహ పరుస్తుందన్నారు. చిన్న హామీలను అమలు చేయలేదని చలో ఇందిరా పార్క్ ధర్నాకు వెళుతున్న ఆశా వర్కర్లను నిర్బంధించి,



రోడ్లపై ఈడ్చుకుంటూ అరెస్టు చేసి గొంతు నొక్కుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆశ వర్కర్ల డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎగమంటి ఎల్లారెడ్డి , జిల్లా కార్యదర్శి కోడం రమణ , ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు మంజుల, జయశీల, సూరం పద్మ, బూర శ్రీనివాస్, జవ్వాజి విమల, భారతి, గాయత్రి, చంద్రకళ, జమున, లావణ్య, రజిత, రుక్మిణి, లత, భూలక్ష్మి, రేణుక, మమత, సునంద తదితరులు పాల్గొన్నారు.

## భక్తులకు అసౌకర్యం కలగకుండా జయంతి ఏర్పాటు

ప్రజాపక్షం/మల్యాల:జగిత్యాల జిల్లా మల్యాల మండలం కొండగట్టు లో చిన్న హనుమాన్ జయంతి ఉత్సవాలు ఏప్రిల్ 1నుండి 3 రోజుల పాటు నిర్వహించనున్న నేపథ్యంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ తెలిపారు.సోమవారం ఆయన,జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తో కలిసి కొండగట్టు ఆలయ పరిసరాల్లో ఉత్సవాల ఏర్పాట్లను పరిశీలించారు.ఈ సందర్భంగా భక్తుల సౌకర్యార్థం చేపడుతున్న ఏర్పాట్లను ప్రత్యక్షంగా సమీక్షించారు. ఉత్సవాలకు భారీ సంఖ్యలో దీక్ష పరులు, భక్తులు హాజరవుతారని భావించి ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. దేవాలయ పరిసర ప్రాంతాల్లో 64 సీసీ కెమెరాల తో భద్రతా ఏర్పాట్లు కట్టుదిట్టంగా ఉండేలా పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రసాదాల కౌంటర్ ల వద్ద క్యూ లైన్ల



వద్ద బందోబస్త్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.పార్కింగ్ సదుపాయాలు సరిపడా ఉండేలా చూడాలని, ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక ప్రణాళిక అమలు చేయాలని అధికారులకు సూచించారు. .ఈ కార్యక్రమంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి.రాజ గౌడ్,జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, డిపివో మదన్ మోహన్, ఆలయ ఏవో అంజనా రెడ్డి, ఎమ్మార్వోలు ,ఎంపిడివోలు,సంబంధిత శాఖల అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రజావాణి

ప్రజాపక్షం/జగిత్యాల టౌన్ : ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రజావాణి అని జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ పేర్కొన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి 74 మంది హాజరై తమ వినతులను కలెక్టర్‌కు అందజేశారు. అలాగే గ్రీష్మ అనే చిన్నారి ప్రజావాణికి హాజరై తన కుటుంబ సభ్యుల అనారోగ్య కారణంతో పాఠశాలకు గైర్హాజరు అయ్యాయని పరీక్షలు రాసేందుకు అనుమతివ్వాలని కలెక్టర్‌కు మొరపెట్టుకోవడంతో కలెక్టర్ స్పందించి డీఈవోకు సమస్యను పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లత, జీవాకర్ రెడ్డి, నరసింహా రావు తదితరులు ఉన్నారు.

## గోదావరి తీరంలో చెత్తవేస్తే జరిమానా

ప్రజాపక్షం/ధర్మపురి : ప్రముఖ పుణ్యక్షేత్రమైన ధర్మపురి గోదావరి నది తీరంలో పరిశుభ్రతను కాపాడాలని,చెత్తవేసి ఉల్లంఘించినట్లైతే మున్సిపల్ పక్షాన రూ.1000 జరిమానా విధించనున్నట్లు ధర్మపురి పురపాలకసంఘం చైర్ పర్సన్ వేముల నాగలక్ష్మి రాజేష్, కమిషనర్ మామిల్ల శ్రీనివాసరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.దక్షిణాభిముఖంగా ప్రవహించే ధర్మపురి గోదావరి నదికి నిత్యం వేలాదిగా వచ్చే భక్తులు నదీతీరంలో ఇష్టానుసారిగా ప్లాస్టిక్ కవర్లు,పూజాసామగ్రి, దీక్షా వస్త్రాలు, మద్యం సీసాలు వేస్తూ అపరిశుభ్రతకు కారణమవుతున్నారని తెలిపారు.తీరంలో దేవతల ఫోటోలు,పూజాసామగ్రి,కొబ్బరిచిప్పలు ఇతరత్రా చెత్త వేసేందుకు మున్సిపల్ పక్షాన డస్ట్ బిన్ లను ఏర్పాటు చేసినట్లు భక్తులు వాటిలోనే వేయాలని వారు సూచించారు.భక్తులు గోదావరి నది స్వచ్ఛతను,పవిత్రతను కాపాడుతూ సహకరించాలని కోరారు.

## భారతీయ జనతా పార్టీలో చేరిన అర్జున్ రెడ్డి

ప్రజాపక్షం/గొల్లపల్లి : జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండల కేంద్రానికి చెందిన యువ నాయకుడు అర్జున్ రెడ్డి బీజేపీ రాష్ట్ర నాయకులు కన్నం అంజన్న,కొమ్ము రాంబాబు ఆధ్వర్యంలో భారతీయ జనతా పార్టీలో చేరారు.ఈ సందర్భంగా పార్టీలో చేరిన అర్జున్ రెడ్డికి రాష్ట్ర నాయకులు కన్నం అంజన్న ,కొమ్ము రాంబాబు ,కాషాయం కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు .ఈ కార్యక్రమంలో బీజేపీ మహిళ రాష్ట్ర నాయకురాలు చింతకింద అనసూర్య, బీజేపీ సీనియర్ నాయకులు కట్ల మహేష్, బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మర్రిపెల్లి సత్యం, కార్యకర్తలు, పాల్గొన్నారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెచ్‌పీవీ వ్యాక్సిన్ కార్యక్రమం

ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం: జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెచ్ పి వి వ్యాక్సిన్ కార్యక్రమాన్ని సోమవారం విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాధి నిరోధక టీకా శాఖకు సంబంధించిన అధికారి డాక్టర్ నరేంద్ర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డాక్టర్ ఎల్. వనజ ఆధ్వర్యంలో 14 నుండి 15 సంవత్సరాల లోపు బాలికలకు గర్భాశయ ముఖ క్యాన్సర్ నివారణ కోసం టీకా అందించారు. మొత్తం 14 మంది అర్హులైన బాలికలకు టీకా వేసినట్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు తెలిపారు. 14 నుండి 15 ఏళ్లలోపు బాలికలకు తల్లిదండ్రులు కచ్చితంగా హెచ్ పి వి టీకాను వేయించాలని వైద్యురాలు డాక్టర్ వనజ కోరారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ విజయ భాస్కర్, హెచ్ఈఓ కృపాకర్, నర్సింగ్ ఆఫీసర్ రాజేందర్, సూపర్వైజర్ టి. సుశీల, నరేష్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## పాక్స్ సర్వసభ్య సమావేశం

ప్రజాపక్షం /ఇబ్రహీంపట్నం : జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో సోమవారం సర్వసభ్య సమావేశాన్ని అఫీషియల్ పీఏసీ ఇంచార్జ్ మహమ్మద్ నిజాముద్దీన్ అధ్యక్షత తన సమావేశం జరిగింది. ఈ సమావేశంలో గత సంవత్సరంలో జరిగిన సంఘ ఆర్థిక లావాదేవీలు, రైతులకు అందుతున్న సేవలు, రాబోయే పంట సీజన్ ఏర్పాట్లు వంటి అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో విండో కార్యదర్శి మంత్రి సతీష్ కుమార్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# చించోలి (బి) పాఠశాలలో మిల్లెట్స్ ఫుడ్ ఫెస్టివల్

### ఆకట్టుకున్న చిరుధాన్యాల వంటకాలు.. విద్యార్థుల ప్రతిభకు ప్రశంసలు

**ప్రజాపక్షం/సారంగాపూర్ :** విద్యార్థుల్లో ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లపై అవగాహన కల్పించే లక్ష్యంతో మండలంలోని చించోలి(బి) జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం మిల్లెట్స్ ఫుడ్ ఫెస్టివల్ ను అత్యంత వైభవంగా నిర్వహించారు.నేషనల్ గ్రీన్ కోర్(ఎన్‌జిసి) ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సుమారు 30 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని,రాగి,జొన్న,సామలు,కొర్రలు వంటి చిరుధాన్యాలతో తయారు చేసిన వివిధ రకాల పౌష్టికాహార వంటకాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సర్పంచ్ వన్నెల సాయన్న,ఉప సర్పంచ్ పోశెట్టి, వీడీసీ చైర్మన్ రవి, ఉపాధ్యక్షుడు అరుణ్, వార్డు సభ్యులు హాజరయ్యారు.విద్యార్థులు స్వయంగా తయారు చేసిన రుచికరమైన వంటకాలను వారు రుచి చూసి, వారిలోని సృజనాత్మకతను అభినందించా రు. ప్రస్తుత కాలంలో చిరుధాన్యాల ప్రాముఖ్యతను వివరించిన అతిథులు, చిన్నప్పటి నుంచే పోషకాలతో కూడిన ఆహారం తీసుకోవాలని సూచించారు.విద్యారులు తయారు చేసిన వంటకాలను విక్రయించగా దాదాపు రూ.8,000 వరకు ఆదాయం సమకూరింది.విద్యార్థుల ఉత్సాహాన్ని చూసి హర్షించిన వీడీసీ చైర్మ న్, సభ్యులు వారికి రూ.3,000 ప్రోత్సాహక బహుమతిని ప్రకటించారు.

ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు మునిందర్ రాజు మాట్లాడుతూ..విద్యార్థుల్లో ఆరోగ్య అవగాహనతో పాటు వంటపట్ల ఆసక్తిని పెంచేందుకు ఇలాంటి ఫుడ్ ఫెస్టివల్స్ దోహదపడతాయని తెలిపారు.ఈ కార్యక్రమాన్ని ఎన్‌జిసి ఇన్‌చార్జ్ సునీత సమన్వయం చేయగా, పాఠశాల ఉపాధ్యాయ బృందం,విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## 108 సిబ్బందికి గుర్తింపు




**ప్రజాపక్షం/ ఆదిలాబాద్ రూరల్ :** ఆదిలాబాద్ జిల్లా 108 అత్యవసర సేవలు రాష్ట్రంలో ప్రతిభ చాటాయి. జిల్లాకు చెందిన ఈఎంటీ ప్యాట అనిల్, పైలట్ సింగారం వినోద్ రాష్ట్రంలో అత్యుత్తమ కేసు నిర్వహణ విభాగంలో ప్రభుత్వ గుర్తింపు పొందారు. జిల్లా మేనేజర్ సురం శేఖర్, ప్రోగ్రామ్ మేనేజర్ సమ్రాట్ బయ్యా అందించిన మార్గదర్శకత్వంతో జిల్లాలో 108 సేవలు సమర్థవంతంగా సాగుతున్నాయి. అత్యవసర పరిస్థితుల్లో వేగంగా స్పందిస్తూ ప్రాణాపాయంలో ఉన్న వారిని కాపాడటంలో వీరు విశేష కృషి చేశారు. రాష్ట్రస్థాయి గుర్తింపు రావడం పట్ల జిల్లా అధికారులు హర్షం వ్యక్తం చేస్తూ సిబ్బందిని అభినందించారు. భవిష్యత్తులో కూడా ఇలాగే నిబద్ధతతో పనిచేస్తూ మరిన్ని అవార్డులు సాధించాలని ఆకాంక్షించారు.

## అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు శంకుస్థాపన

**ప్రజాపక్షం / జన్నారం :** జన్నారం మండలంలోని మొర్రిగూడ గ్రామం ఎస్‌సి కాలనీలో సోమవారం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహ నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. ఏప్రిల్ 14న అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం చేపట్టనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు కలిసి విగ్రహ స్థాపనకు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో మొర్రిగూడ గ్రామ సర్పంచ్ విజయం లచ్చన్న, జన్నారం మండల అంబేద్కర్ సంఘం అధ్యక్షులు భరత్ కుమార్, మాజీ జడ్‌పిటిసి పంకజ, తిమ్మాపూర్ గ్రామ మాజీ సర్పంచ్ జాడి గంగాధర్, వార్డు సభ్యులు, యువజన సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## విశ్రాంత ఉపాధ్యాయుడికి గాయాలు

**ప్రజాపక్షం / సిర్పూర్ టి :** కదులుతున్న రైలు నుంచి జారిపడి కాగజ్ నగర్‌కు చెందిన ఒక విశ్రాంత ఉపాధ్యాయుడు గాయపడ్డారు. సిర్పూర్ టి రైల్వే స్టేషన్ పరిధిలో సోమవారం రైలు కదులుతున్న సమయంలో ఆయన ప్రమాదవశాత్తు కింద పడటాన్ని గమనించిన రైల్వే సిబ్బంది వెంటనే స్పందించి స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయనకు ప్రాణాపాయం తప్పిందని, ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు. ప్రయాణికులు రైలు ప్రయాణంలో జాగ్రత్తలు పాటించాలని రైల్వే అధికారులు సూచించారు.

# కలెక్టరేట్‌లో ఉచిత అంబలి పంపిణీ ప్రారంభం

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం (టిఎన్‌జిఒ) జిల్లా శాఖ ఆధ్వర్యంలో సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో ఏర్పాటు చేసిన ఉచిత అంబలి పంపిణీ కేంద్రాన్ని కలెక్టర్ ఇలా త్రిపాఠి సోమవారం ప్రారంభించారు. వేసవి సీజన్‌ను దృష్టిలో పెట్టుకుని ఉద్యోగులకు ఉపశమనం కల్పించేందుకు వీలుగా తాగునీటితో పాటు ఉచితంగా అంబలి పంపిణీకి చొరవ చూపటం అభినందనీయమని టిఎన్‌జిఒ సంఘాన్ని అభినందించారు . ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి టిఎన్‌జిఒ ప్రతినిధులు కృషి చేస్తూ సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడం గొప్పవిషయమన్నారు. కలెక్టరేట్ ఉద్యోగులతో పాటు వివిధ పనుల కోసం సమీకృత జిల్లా




కార్యాలయాల సముదాయానికి వచ్చే వారికి ప్రస్తుత వేసవిలో అంబలి కేంద్రం ఉపశమనాన్ని అందిస్తుందన్నారు. కార్యక్రమంలో టిఎన్‌జిఒ సంఘం జిల్లా అధ్యక్షుడు సుమన్, కార్యదర్శి శేఖర్, రాష్ట్ర నాయకులు గైని గంగారాం పాల్గొన్నారు.

# ప్రజావాణి అర్జీలను త్వరగా పరిష్కరించాలి

### ఐటిడిఎ పిఒ యువరాజ్ మార్మాట్



**ప్రజాపక్షం/ ఉట్నూర్ :** ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించేలా అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని ఉట్నూర్ ఐటిడిఎ పిఒ యువరాజ్ మార్మాట్ ఆదేశించారు. సోమవారం ఐటిడిఎ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ సమస్యలపై ప్రజల నుండి ఆయన అర్జీలను స్వీకరించారు. బెజ్జూర్ మండలం కుకూడ గ్రామానికి చెందిన సత్తయ్య అటవీ హక్కు పత్రం మంజూరు చేయాలని, ఉట్నూర్ మండలం లక్సెట్టిపేట గ్రామానికి చెందిన తొడసం మారుతి తన వ్యవసాయ క్షేత్రానికి బోరుబావి మంజూరు చేయాలని విన్నవించారు. భీంపూర్ గ్రామానికి చెందిన ప్రజలు గొర్రెల రుణాలు కల్పించాలని కోరారు. పింఛన్లు, ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, స్వయం ఉపాధి పథకాల మంజూరుతో పాటు వ్యవసాయ, రెవెన్యూ శాఖలకు సంబంధించిన సమస్యలను పరిష్కరించాలని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలు ధరఖాస్తులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# హక్కుల సాధనే లక్ష్యంగా ఉద్యమం

### పుట్ట కృష్ణమాచారి

**ప్రజాపక్షం / చెన్నూరు :** కాంగ్రెస్ ప్రభుత్వం ఆశాలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సిఐటియు నాయకుడు పుట్ట కృష్ణమాచారి ఆధ్వర్యంలో ఆశా వర్కర్లు నిరసన వ్యక్తం చేశారు. సోమవారం స్థానిక తెలంగాణ తల్లి విగ్రహం ఎదుట జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా కృష్ణమాచారి మాట్లాడుతూ ఆశాలకు ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు వేతనాన్ని 18 వేల రూపాయలకు పెంచి ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కనీస జీతాలు ఇవ్వకుండా ఆశాలతో వెట్టిచాకిరీ చేయించు



కుంటే ఊరుకోబోమని హెచ్చరించారు. ఆశాల హక్కుల సాధనకై నిరంతర పోరాటం చేస్తామని, వారి సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్స్ జిల్లా ప్రధాన కార్యదర్శి సరోజ, సభ్యులు విజయ, లక్ష్మి , శారద, మల్లీశ్వరి పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాసులు త్వరగా పరిష్కారం

### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**ప్రజాపక్షం / నస్పూర్ :** ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. సోమవారం నస్పూర్ లోని సమీకృత జిల్లా కార్యాలయాల సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్లు పి.చంద్రయ్య (స్థానిక సంస్థలు), శ్రీనివాస్ రావు (రెవెన్యూ)లతో కలిసి ఆయన అర్జీదారుల నుండి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా పలువురు బాధితులు తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. చెన్నూర్ కు చెందిన దాసరి ప్రవీణ్ కుమార్, రమేష్ తమ పట్టా భూమిని నిషేధిత జాబితా నుండి తొలగించి పాసు పుస్తకాలు ఇవ్వాలని కోరారు. అలాగే భూమి పట్టా మార్పిడి, విరాసత్, పెండింగ్ బిల్లుల చెల్లింపులు, వృద్ధాప్య పింఛన్లు మంజూరు చేయాలని మరికొందరు దరఖాస్తులు అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజావాణి దరఖాస్తుల విషయంలో అధికారులు సమన్వయంతో పనిచేసి బాధితులకు న్యా యం చేయాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు , వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల పనులు వేగవంతం చేయాలి: ఎంపిడిఒ

**ప్రజాపక్షం / పెంచికలపేట్ :** మండలంలోని వివిధ గ్రామాల్లో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్ల పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని ఎంపిడిఒ ఆల్బర్ట్ సూచించారు. సోమవారం మండలంలోని ఎల్కపల్లి, ఎల్లూర్ గ్రామ పంచాయతీలలో పర్యటించిన ఆయన నిర్మాణంలో ఉన్న గృహాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న గృహాల నిర్మాణంలో ఎక్కడా రాజీ పడకుండా నాణ్యతా ప్రమాణాలను పాటించాలని లబ్ధిదారులకు సూచించారు. పనుల్లో జాప్యం చేయకుండా నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం లబ్ధిదారులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్న ఆయన, వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎల్కపల్లి సర్పంచ్ రాంచందర్, ఎల్లూర్ సర్పంచ్ రవీందర్, పంచాయతీ కార్యదర్శులు, లబ్ధిదారులు పాల్గొన్నారు

## ప్రజావాణికి 106 ఫిర్యాదులు



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 106 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్లు కిరణ్‌కుమార్, దిలీప్‌కుమార్, సబ్‌కలెక్టర్లు వికాస్ మహతో, అభిగ్యాన్ మాల్వియ, డీఆర్‌డీఓ సాయగౌడ్, ఆర్డీఓ రాజేంద్రకుమార్, ఏసీపీ మస్తాన్‌అలీలకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు . కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## బైక్ అదుపు తప్పి వ్యక్తి మృతి

**ప్రజాపక్షం/పిట్లం :** పిట్లం మండలంలోని ధర్మారం గ్రామానికి చెందిన జాదవ్ రాజు (28) అనే గిరిజన యువకుడు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. అతను తన వద్ద గల తుఫాన్ వాహనం ఫైనాన్స్ చెల్లించేందుకు పిట్లంకు వెళ్లి తిరిగి తన స్వగ్రామం ధర్మారం గ్రామానికి బైకుపై వస్తున్న క్రమంలో చిన్నకొడప్‌గల్ గ్రామ శివారులో తన బైకు అదుపుతప్పి పంటపొలాల్లో పడిపోగా తీవ్ర గాయాలై జాదవ్‌రాజు మృతిచెందినట్లు పిట్లం ఎస్‌ఐ వెంకట్‌రావు పేర్కొన్నారు. మృతుని తండ్రి జాదవ్ హరిసింగ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మృతునికి భార్య, ఇద్దరు సంతానం కలరు.

## ప్రజావాణి అర్జీలను పరిష్కరించాలి

### కలెక్టర్ రాజర్షి షా



**ప్రజాపక్షం/ మావల :** ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి స్వీకరించే ప్రతి అర్జీని త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల అర్జీలను ఆయన స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజావాణి ద్వారా వచ్చే ప్రతి దరఖాస్తును నిర్లక్ష్యం చేయకుండా శాఖల వారీగా సమీక్షించి పరిష్కరించాలన్నారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ఆశతో వస్తారని, వారి విన్నపాలకు ప్రాధాన్యత ఇచ్చి సత్వరమే తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

## అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన



ప్రజాపక్షం/ తలమడుగు : తలమడుగు మండలం సకినాపూర్ గ్రామంలో శ్రీ అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం సోమవారం వైభవంగా ముగిసింది. ఈ సందర్భంగా గత 21 రోజులుగా హనుమాన్ దీక్షాధారులతో పాటు గ్రామస్తులందరూ మద్యం, మాంసం, పాదరక్షలకు దూరంగా ఉండి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఇతర ప్రాంతాల నుండి వచ్చే వారు కూడా పాదరక్షలు ధరించి గ్రామంలోకి రాకుండా పొలిమేరలోనే బోర్డులు ఏర్పాటు చేసి నిబంధనలు పాటించారు. ప్రతిష్ఠాపనలో భాగంగా చివరి రోజు హోమం, పూర్ణాహుతి నిర్వహించి అనంతరం మహా అన్నదానం చేశారు. గ్రామస్థులందరూ ఒక్క చోట చేరి పూజల్లో పాల్గొనడంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.

## విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలకు పరీక్ష



**ప్రజాపక్షం / కాగజ్ నగర్ :** మూడవ తరగతి విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలను అంచనా వేసేందుకు నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే ఆధ్వర్యంలో ఫౌండేషన్ లెర్నింగ్ స్టడీ (ఎఫ్ఎల్ఎస్) పరీక్ష నిర్వహించినట్లు మండల విద్యాధికారి వాసాల ప్రభాకర్ తెలిపారు. సోమవారం కాగజ్ నగర్ మండలంలోని కోసిని, రాస్పెల్లి, ఆరిగూడ ప్రాథమిక పాఠశాలల్లో ఈ పరీక్షలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోసినిలో 8 మంది, రాస్పెల్లిలో 6 మంది, ఆరిగూడలో 18 మంది కలిపి మొత్తం 32 మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు వివరించారు. పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందజేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు ఆత్రం ప్రమీల, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బడుగు సదానందం, ఉపాధ్యాయులు రజిత, శారద, ఫీల్డ్ ఇన్‌స్ట్రక్టర్ అంజలి పాల్గొన్నారు.

## తానూర్‌లో పోలీసుల కమ్యూనిటీ కాంటాక్ట్

### 65 వాహనాలు సీజ్

**ప్రజాపక్షం/తానూర్ :** మండలం కేంద్రంలో పోలీస్ శాఖ కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సిఐ రవీందర్ నాయక్, ఎస్ఐలు అశోక్, పర్సిస్, జుబేర్ సహా 20 మందికి పైగా పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.తనిఖీల్లో భాగంగా సరైన పత్రాలు లేని, 60 ద్విచక్ర వాహనాలు,5 ఆటోలను,కలిపి మొత్తం 65 వాహనాలను సీజ్ చేశారు. ప్రజలు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ, తప్పనిసరిగా వాహన పత్రాలు కలిగి ఉండాలని అధికారులు సూచించారు.

# వెంకటేశ్వర స్వామి జాతరలో కుస్తీ పోటీలు



**ప్రజాపక్షం/నిజాంసాగర్ :** మహ్మద్‌నగర్ మండలంలోని సింగితం గ్రామంలో వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద జాతర నిర్వహించారు. ఇందులో భాగంగా సోమవారం కుస్తీపోటీలు నిర్వహించారు. ప్రాచీన సాంప్రదాయాలను సజీవంగా నిలుపుతూ, యువతలో స్ఫూర్తిని రగిలించేలా ఈ కుస్తీ పోటీలు ఎంతో ఉత్సాహంగా నిర్వహించారు. గ్రామపెద్దల ఆధ్వర్యంలో కుస్తీపోటీలు నిర్వహించగా ఈ పోటీలను తిలకించేందుకు ఆయా గ్రామాల నుండి ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ పోటీల్లో గ్రామస్థులే కాకుండా చుట్టుపక్కల గ్రామాలు, మండలాల నుండి మల్లయోధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రూ 10 నుండి మొదలుకుని 500ల రూపాయల వరకు కుస్తీపోటీలు జరిగాయి. చివరి కుస్తీ విజేతకు నర్వ గ్రామానికి చెందిన స్వర్గీయ ముప్పిడి రాములు గుప్తా జ్ఞాపకార్థం వారి కుమారుడు రాంప్రసాద్ 5 తులాల వెండి కడియం బహుకరించగా గ్రామస్థులు 2000 రూపాయల నగదు బహుమతితో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచు రఫీ, గ్రామ అధ్యక్షుడు రాములు, ప్రజలు పాల్గొన్నారు.

# ఆశా వర్కర్ల అక్రమ అరెస్టులు దుర్మార్గం

### సిఐటియు నిర్మల్ జిల్లా కమిటీ ఆగ్రహం

**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :** రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా ఆశా వర్కర్లు చేపట్టదలచిన హైవే దిగ్బంధన కార్యక్రమాన్ని భగ్నం చేసేందుకు పోలీసులు ముందస్తు అరెస్టులు చేయడాన్ని సిఐటియు నిర్మల్ జిల్లా కమిటీ తీవ్రంగా ఖండించింది.సోమవారం ఉదయం నుంచే జిల్లా వ్యాప్తంగా మండల కేంద్రాల్లో ఆశా వర్కర్లను,యూనియన్ నాయకులను పోలీసులు అక్రమంగా నిర్భందించడంపై నాయకులు మండిపడ్డారు.

**ప్రజా పాలనలో అణిచివేత సరికాదు..బొమ్మెన సురేష్**

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదరిశ బొమ్మెన సురేష్ మాట్లాడుతూ.ప్రజాపాలన అని చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం,కార్మికుల హక్కుల కోసం చేసే నిరసనలను అణచివేయడం నిరంకుశత్వానికి నిదర్శనమని విమర్శించారు. గత ప్రభుత్వాల తరహాలోనే కార్మికులను నిర్బందించడం సరికాదని హితవు పలికారు.ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం ఆశాలకు నెలకు రూ.18,000 కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. పి.గంగామణి మాట్లాడుతూ శాంతియుతంగా సమస్యలను చెప్పుకుందామనుకున్న ఆ శా వర్కర్లను ఇళ్లకు వెళ్లి హౌస్ అరెస్ట్ చేయడం రాత్రి వేళల్లో పోలీస్ స్టేషన్లకు తరలించడం సిగ్గుమాలిన చర్య అని విమర్శించారు.కరోనా కష్టకాలంలో ప్రాణాలకు తెగించి సేవలు అందించిన ఆశాల పట్ల ప్రభుత్వం కనికరం లేకుండా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఆశా యూనియన్ జిల్లా అధ్యక్షురాలు బి.సూజాతను పలువురు కార్యకర్తలను సిఐటియు కార్యాలయం నుంచి పోలీసులు బలవంతంగా అరెస్ట్ చేసి తరలించడాన్ని నాయకులు తప్పుబట్టారు.వెంటనే అరెస్టుయిన వారందరీని విడుదల చేయాలని,ఆశాలకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వం స్పందిచకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జిల్లావ్యాప్తంగా పలువురు ఆశావర్కర్లు, సిఐటియు నాయకులు పాల్గొన్నారు.

# సర్పంచ్ అధికార దుర్వినియోగంపై విచారణ జరపాలి

### కలెక్టర్‌కు దరోగపల్లి ఉపసర్పంచ్, వార్డు సభ్యుల ఫిర్యాదు



**ప్రజాపక్షం / పెంచికలపేట్ :** మండలంలోని దరోగపల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్ అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని, సర్పంచ్‌పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఉపసర్పంచ్, వార్డు సభ్యులు జిల్లా కలెక్టర్‌కు సోమవారం విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ పంచాయతీ నియమ నిబంధనలను తుంగ లో తొక్కి సర్పంచ్ భర్త ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. వార్డు సభ్యుల ఆమోదం లేకుండా, గ్రామ సభలో ఎటువంటి తీర్మానాలు చేయకుండానే సర్పంచ్ భర్త బొట్టుపల్లి శ్రీకర్ (హరీష్) తన ఇష్టమొచ్చినట్లు పనులు చేస్తున్నారని బాధితులు ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రజలకు ఉపయోగం లేని పనులు చేస్తూ, ప్రశ్నించిన వార్డు సభ్యులను అవమానపరుస్తున్నారని తెలిపారు. దీనిపై సర్పంచ్‌ను వివరణ కోరగా, తమ భర్త ఇష్టమొచ్చినట్లే చేస్తారని, ఏం చేసుకుంటారో చేసుకోండని బెదిరింపులకు దిగుతున్నారని వారు ఆరోపించారు. స్థానిక పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని వారు వాపోయారు. సర్పంచ్ తన అధికారాలను భర్తకు అప్పగించి నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని, దీనిపై తక్షణమే విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ ఫిర్యాదు చేసిన వారిలో ఉపసర్పంచ్ కన్నె అవిన్, వార్డు సభ్యులు మనాకాలిక కవిత, ఎర్రబాయిన సాయి, నాయిని రజిత తదితరులు ఉన్నారు.

# గ్రామాభివృద్ధికి పాటుపడండి

### పిలుపునిచ్చిన సర్పంచ్ షబానా బేగం ఇజాజోద్దీన్

**ప్రజాపక్షం/ముధోల్ :** గ్రామ అభివృద్ధికి ప్రతి ఒక్కరు పాటుపడాలని ముధోల్ గ్రామ సర్పంచ్ పిలుపునిచ్చారు .సోమవారం గ్రామపంచాయతీ కార్యాలయావరణంలో వారసంత వేలం పాట అదేవిధంగా వార్డు సభ్యుల సమక్షంలో గ్రామసభ నిర్వహించడం జరిగింది.వారపు వేల సంతలో నలుగురు పాల్గొనగా సాయినాథ్ అనే వ్యక్తి 2026–27 సంవత్సరానికి గాను 2 లక్షల 21 వేల రూపాయలకు వేలం దక్కించుకున్నారు.అనంతరం నిర్వహించిన గ్రామసభలో వార్డు సభ్యులు తమ తమ కాలనీలో ఉన్న సమస్యలను సర్పంచ్ గ్రామ పంచాయతీ ఈఓ అన్వర్ అలీ దృష్టికి తీసుకువెళ్లారు.వార్డు సభ్యులు తమకాలనీలోని తెలిపిన సమస్యలను రిజిస్టర్లో నమోదు చేసుకొని దశలవారిగా సమస్యలను పరిష్కరిస్తామని పేర్కొన్నారు.రోజువారీగా గ్రామాన్ని పర్యవేక్షిస్తూ సమస్యలను ఆరాతీయడం జరుగుతుందని తెలిపారు.గ్రామంలో ఎవైనా సమస్యలుంటే గ్రామ పంచాయతీ దృష్టికి తీసుకురావాలని కోరారు.అందరి సహకారంతోనే గ్రామాభివృద్ధి సాధ్యమని దీనికి ప్రతొక్కరు కట్టుబడి ఉండాలని అకాంక్షించారు.వేసవికాలాన్ని దృష్టిలో ఉంచుకుని నీటి ఇబ్బందులు కలుగకుండా ఇప్పటికే ప్రతి కాలనీలో బోరు బావులు వేయించడం జరిగిందని వెల్లడించారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ లావణ్య సాయినాథ్,వార్డు సభ్యులు విశ్వంబర్, జమీల్, అబ్బుభాయ్, జానకి, బషీర్, లక్ష్మి , తదితరులు పాల్గొన్నారు.

## ఐస్‌క్రీమ్స్ తోపుడు బండ్లు గ్రామంలోకి నిషేధం




**ప్రజాపక్షం/నిజామాబాద్ రూరల్ :** నిజామాబాద్ రూరల్ మండలంలోని సుద్దపల్లి గ్రామసర్పంచ్ రూపా సతీష్‌రెడ్డి వినూత్న కార్యక్రమం చేపట్టారు. ఐస్‌క్రీమ్స్ తోపుడు బండ్లు గ్రామంలోకి నిషేధం విధించారు. ఈ సందర్భంగా రూపా సతీష్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామస్తుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామంలో ఐస్‌క్రీమ్స్ తోపుడు బండ్లు వచ్చే వాళ్లను నిషేధించామన్నారు. ఈ అమలు వచ్చిన 2 నుండి విధించటం జరిగిందన్నారు. కల్తీ ఐస్ క్రీంతో పిల్లల ఆరోగ్యం చెడిపోతుందని గ్రామంలో అభివృద్ధి ఒకటే కాదు గ్రామంలోని పిల్లల ఆరోగ్యం కూడా ముఖ్యమని ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. గ్రామస్తులతో పాటు గ్రామాభివృద్ధి కమిటీ కూడా సహకరిస్తున్నారని తెలిపారు. రాబోవు రోజుల్లో ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని మరెన్నో కార్యక్రమాలు చేపడుతామని తెలిపారు. ఎవరైనా పర్మిషన్ లేకుండా గ్రామంలోకి వచ్చి అమ్మినట్లయితే వారికి 5 వేల జరిమానా విధిస్తామని తెలిపారు.

## సిసిరోడ్డు పనులు ప్రారంభం



**ప్రజాపక్షం/పిట్లం:** పిట్లం మండలంలోని హస్నాపూర్ గ్రామంలో సోమవారం ఉపాధిహామీ పథకం కింద మంజూరైన 5 లక్షల రూపాయల నిధులతో గ్రామ సర్పంచ్ లావణ్య భాస్కర్ కొబ్బరికాయలు కొట్టి సిసిరోడ్డు పనులు ప్రారంభించారు. సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో అంతర్గత రహదారుల సమస్యను పరిష్కరించి గ్రామస్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే తమ ధ్యేయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి కిరణ్, గ్రామపెద్దలు తదితరులు ఉన్నారు.

## కలెక్టర్ రాజర్షి షాను కలిసిన సహకార శాఖ అధికారి



**ప్రజాపక్షం/ ఆదిలాబాద్ అర్బన్ :** ఆదిలాబాద్ జిల్లా సహకార శాఖ ఇన్‌చార్జి అధికారిగా బాధ్యతలు స్వీకరించిన మాదా సత్యానారాయణ సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర రాజర్షి షాను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. జిల్లాలో సహకార రంగ అభివృద్ధి, రైతులకు అందిస్తున్న సేవలు, ప్రస్తుత కార్యక్రమాల అమలు తదితర అంశాలపై కలెక్టర్‌తో చర్చించారు. సహకార సంఘాల బలోపేతానికి, పారదర్శకంగా సేవలు అందించేందకు కట్టుబడి పనిచేస్తానని మాదా సత్యనారాయణ పేర్కొన్నారు. జిల్లా అభివృద్ధిలో సహకార శాఖ కీలక పాత్ర పోషించాల్సిన అవసరం ఉందని, ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు ప్రజలకు మెరుగైన సేవలు అందించడంతో పాటు రైతు సంక్షేమానికి ప్రత్యేకంగా దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాజేశ్వర్, శిక్షణ కలెక్టర్ సలోని చాబ్రా, సంబంధిత శాఖాధికారులు పాల్గొన్నారు.

# బాలల సంరక్షణకు ప్రత్యేక చర్యలు

### కలెక్టర్ కుమార్ దీపక్



**ప్రజాపక్షం / నస్పూర్:**ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా బాలల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. సోమవారం నస్పూర్ లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో వివిధ శాఖల అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 99 రోజుల ప్రగతి ప్రణాళికలో బాలల పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లా పంచాయతీ అధికారి ఆధ్వర్యంలో గ్రామ బాలల పరిరక్షణ కమిటీలను బలోపేతం చేయాలని, అనాథ పిల్లలను గుర్తించి తగిన వసతి గృహాల్లో చేర్పించాలని ఆదేశించారు. 14 ఏళ్లలోపు పిల్లలను బాల కార్మికులుగా మార్చకుండా వారిని బడిలో చేర్పించాలన్నారు. ముఖ్యంగా ఇటుక బట్టీల వద్ద ఉండే పిల్లల కోసం పని ప్రదేశాల్లోనే పాఠశాలలు ఏర్పాటు చేయాలని కార్మిక శాఖ అధికారులకు సూచించారు. డ్రాపౌట్ పిల్లలను గుర్తించి విద్యాసంస్థల్లో చేర్పించడంతో పాటు, చైల్డ్ హెల్ప్ లైన్ కు అందే ఫిర్యాదులను అధికారులు సమన్వయంతో త్వరితగతిన పరిష్కరించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి రౌఫ్ ఖాన్, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావు, జిల్లా విద్యాధికారి ఎస్.యాదయ్య, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి నీరటి రాజేశ్వరి, అదనపు గిరిజన సంక్షేమ శాఖ అధికారి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఇచ్చిన హామీని నిలబెట్టుకున్న సర్పంచ్ రాథోడ్ రాజేందర్..

**ప్రజాపక్షం/బోథ్ :**బోథ్ మండలంలోని బిర్గాగొంది గ్రామా సర్పంచ్ ఎన్నికలో ఇచ్చిన హామి మేరకు గ్రామంలో పెండ్లిడికీ ఉన్న ప్రతి ఇంటి అడబిడ్డ పెండ్లికి 10,116 రూపాయలు సాయం అందిస్తాను అని జరిగిన సర్పంచ్ ఎన్నికలో హామీ ఇచ్చారు.ఆ హామీని సోమవారం గ్రామంలో పవర్ సంతోష్ కుమార్తె వివాహనికి గ్రామ యువకులతో కలిసి వెళ్లి ఆర్థిక సహాయం అందించారు.ఇచ్చిన హామీకి కట్టుబడి ఉన్న సర్పంచ్ ను గ్రామ ప్రజలు అభినందించారు.

## గురుకుల సీట్లు సాధించిన విద్యార్థులకు సన్మానం

**ప్రజాపక్షం/మామడ:**మామడ మండలంలోని పరిమండల్ గ్రామంలో గల మండల పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు ఇటీవల వెల్లడైన గురుకుల ప్రవేశ పరీక్ష ఫలితాల్లో ప్రతిభ చాటి సీట్లు సాధించారు. పాఠశాలకు చెందిన బొజ్జారం, శ్రీనిత్, గుడిసెల ప్రావీన్య,సుంకరి లౌహిక లు గురుకుల పాఠశాలల్లో సీట్లు సాధించగా వీరిని,వీరి తల్లిదండ్రులని పాఠశాల ఉపాధ్యాయుల బృందం ఘనంగా సన్మానించింది.విజేతల తల్లిదండ్రులని శాలువా మెమొంటులతో సత్కరించారు.ఈ సందర్భంగా సర్పంచ్ లయశ్రీ మల్లేష్ మాట్లాడుతూ.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మహేష్,ఉపాధ్యాయ బృందం,గ్రామ ప్రజా ప్రతినిధులు వార్డు సభ్యులు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## యువకుడికి జాతీయ ఉగాది పురస్కారం

**ప్రజా పక్షం/ఇబ్రహీంపట్నం:**కరీంనగర్ నగరంలోని ఫిలిం భవన్ లో తెలుగు వెలుగు జాతీయ ఉగాది సాంస్కృతిక ఉత్సవాలు తెలుగు వెలుగు సాహితీ వేదిక, తెలుగు ఇండియన్ కల్చరల్ బుక్ ఆఫ్ రికార్డ్స్, కాళోజి తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ సంయుక్తంగా ఆధ్వర్యంలో సోమవారం రాత్రి ఘనంగా జరిగాయి.ఈ సందర్భంగా తెలంగాణ వ్యాప్తంగా వివిధ రంగంలో విశేష సేవలు అందిస్తున్న ప్రముఖులకు పురస్కారాలు అందజేశారు. ప్రపంచ పఖ్యాత గిన్నిస్ వరల్డ్ రికార్డ్ గ్రహీత విశ్వ కళా విరాట్ డాక్టర్ శాంతి వంగల కృష్ణ ,ప్రముఖ ,సహజనటి గుంటుక రాధిక, జాతీయయువజన అవార్డు గ్రహీత కిరణ్ కుమార్,తెలుగు వెలుగు సాహితి వేదిక జాతీయ చైర్మన్ పోలోజు రాజ్ కుమార్ చేతుల మీదుగా అవార్డును శ్రీపాద లింబాద్రి అందుకున్నారు.

# నెంబర్ వన్ లక్ష్యంగా ఎస్ఆర్పి 1 గని

### జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్




**ప్రజాపక్షం / శ్రీరాంపూర్ :**సింగరేణిలో ఉత్పత్తి లక్ష్యాలను సాధించడంలో ఎస్ఆర్పి 1 గని మరోసారి నెంబర్ వన్ స్థానంలో నిలవాలని శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్ ఆకాంక్షించారు. సోమవారం ఆయన గనిని సందర్శించి రీఓపెన్ చేసిన 1 సీమ్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ మాట్లాడుతూ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో అన్ని భూగర్భ, ఓపెన్ కాస్ట్ గనుల కంటే ముందుగానే ఉత్పత్తి లక్ష్యాన్ని చేరుకుని ఈ గని ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుందన్నారు. ఇదే ఉత్సాహంతో 202627 ఆర్థిక సంవత్సరంలోనూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ నెలతో ఉత్పత్తి నిలిచిపోవాల్సిన ఈ గనికి, వచ్చే ఏడాదికి కూడా అనుమతులు లభించాయని.. ఈ అవకాశాన్ని అధికారులు, కార్మికులు సమిష్టిగా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కొత్తగా ప్రారంభించిన సీమ్1లో పనులను వేగవంతం చేసి త్వరలోనే ఉత్పత్తి ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం గని మేనేజర్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించి, రక్షణతో కూడిన ఉత్పత్తి సాధనకై ప్రణాళికాబద్ధంగా సిద్ధం కావాలని దిశానిర్దేశం చేశారు. మెరుగైన ఓఎంఎస్‌తో ఈ గనిని సంస్థలోనే అగ్రగామిగా నిలపాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్పి గ్రూప్ ఏజెంట్ జి. రవికుమార్, గని మేనేజర్ ఆత్మారాం సహాని, సర్వేయర్ టి. సంతోష్ పాల్గొన్నారు.

# ఒప్పంద పద్ధతిన పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

**ప్రజాపక్షం / హాజీపూర్:**జిల్లాలోని హాజీపూర్ మండలం గుడిపేటలో గల టిజిఎస్‌పి 13వ పటాలంలో ఒప్పంద పద్ధతిన పోస్టుల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పటాలం కమాండెంట్ ఒక ప్రకటనలో తెలిపారు. పటాలంలో ఖాళీగా ఉన్న దోబీ, కుక్ పోస్టుల కొరకు అర్హత గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ పోస్టులకు దరఖాస్తు చేసే అభ్యర్థులు ఎలాంటి క్రిమినల్ కేసుల్లో ఉండకూడదని, దీనికి సంబంధించి పోలీస్ స్టేషన్ నుండి ధ్రువపత్రం సమర్పించాలని స్పష్టం చేశారు. మంచిర్యాల జిల్లా, గుడిపేట ప్రాంతానికి చెందిన వారికి, అలాగే పోలీస్ శాఖలో పనిచేస్తూ మృతి చెందిన లేదా పదవీ విరమణ పొందిన వారి కుటుంబ సభ్యులకు ఈ నియామకాల్లో ప్రాధాన్యత ఉంటుందని వెల్లడించారు.జిల్లా కేంద్రంలోని మాతా శిశు ఆసుపత్రిలో ప్రసవాల సంఖ్య పెరగడం పట్ల సంతోషం వ్యక్తం చేసిన ఆయన, వర్షాకాలంలో గర్భిణులకు ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు ఆసక్తి గల అభ్యర్థులు తమ విద్యార్హత, కులం, నివాస ధ్రువపత్రాలతో పాటు ఆధార్ కార్డు, అనుభవ పత్రాలను జత చేసి ఏప్రిల్ 6వ తేదీ లోగా కార్యాలయంలో అందజేయాలని కోరారు.

# ప్రభుత్వ ఆసుపత్రికి మోక్షమెప్పుడో

**ప్రజాపక్షం/ముధోల్ :**నియోజవర్గ కేంద్రమైన ముధోల్ లో గత దశాబ్దాల కాలంగా ఆసుపత్రి లేక నియోజకవర్గ ప్రజలు వైద్యం కోసం అల్లాడుతున్నారు.ఉమ్మడి అంధ్రప్రదేశ్‌లో కాకపోయినా కనీసం తెలంగాణ ఆవిర్భావం అయిన తర్వాతనైనా ఆసుపత్రి కల నెవరవేరుతుందేమోనని ఎంతో ఆశతో ఎదురుచూసిన నేటి వరకు నియోజకవర్గ కేంద్రంలో ఆసుపత్రి నిర్మింపబడలేదు,వైద్య సదుపాయాలు మెరుగుపడలేదు.ఎక్కడ గొంగళి అక్కడే వేసినట్లుగా ఎన్నో దశాబ్దాలుగా పెచ్చులుడిపోయిన భవనంలోనే వైద్యం అందిస్తున్నారు.వర్షాకాలంలోనైతే భవనం కప్పు నుండి వరషపునీరు కారుతూ మందులు సైతం తడిసిన రోజులున్నాయి.గత వర్షకాలంలో వర్షపునీటిలో చాలా మందులు తడవడమే కాకుండా సిబ్బందికి విధులు నిర్వహించడం సైతం చాలా కష్టంగా మారింది.గత కొన్ని దశాబ్దాల క్రితం ఎంతో కొంత మెరుగైన సదుపాయాలున్న తదనంతరం ఆసుపత్రి మరుగున పడింది.గతంలో ప్రాథమిక ఆసుపత్రి ఉన్న దాన్ని సామాజిక ఆరోగ్య కేంద్రంగా మారుస్తూ నలుగురు వైద్యలను ఒక సూపరింటెండెంట్ ను నియమించి ఉన్నతపరిచారే తప్ప సరైన ఆసుపత్రి భవనం లేక వైద్యం పొందడం స్థానిక,చుట్టూ పక్కల ప్రజలకు కష్టంగానే మారింది.వైద్యం కోసం చుట్టూ పక్కల ప్రాంతాలకు వెళ్లి వ్యయం ప్రయాసాలకు గురువడం నిరుపేదలకు తీవ్ర ఇబ్బందులను కలిగిస్తోంది.గత బిఆర్ఎసవ హయాంలో నూతన 30 పడకల ఆసుపత్రి భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసి బేస్మెంట్ లెవెల్ వరకు పరిమితం చేసి నిర్మాణం నిలిపివేశారు.చేపట్టిన నిర్మాణం బిల్లులు రాక భవన నిర్మాణ పనులు ఆపివేసినట్లు సమాచారం.సీఎం రెవంత్ రెడ్డి ఇటీవల బాసర సరస్వతి అమ్మ వారి నిర్మాణానికి 100 కోట్లు,ఇంటిగ్రేటెడ్ గురుకుల పాఠశాలలకు 200 కోట్లు నిధులు కేటాయించినట్లే ఎన్నో ఏళ్ల కలగా ఉన్న ఆసుపత్రి నిర్మాణం కోరకు సైతం త్వరితగతిన నిధులు మంజూరు చేసి నియోజకవర్గ ప్రజల ఆశ నెరవేరుస్తారని ఆకాంక్షిస్తున్నారు.ఏప్రిల్ 6న బాసర పర్యటనలో భాగంగా ముధోల్ నియోజకవర్గ ప్రజలకు ముఖ్యమంత్రి నోటా ఆసుపత్రి భవన ఏర్పాటుకై శుభసందేశం అందుతుందని ఉవ్విళ్లూరుతున్నారు.

## అంబులెన్స్ లో మహిళా ప్రసవం..

**ప్రజాపక్షం/నేరడిగొండ:**నేరడిగొండ మండలంలోని మారుమూల గ్రామపంచాయతీ అయినా గుప్తాల గ్రామానికి చెందిన బాలింత పురిటి నొప్పులతో బాధపడుతుండగా108 కు కాల్ చేయడంతో 108 సిబ్బంది ఈఎంటి సంతోష్,పైలట్ ప్రశాంత్,లు స్పందించి ప్రభుత్వ ఆసుపత్రి నేరడిగొండకు తరలిస్తుండగా మార్గమధ్యలో అంబులెన్స్లోనే గర్భిణి ప్రసవించి పండంటి ఆడబిడ్డ కు జన్మనివ్వడం జరిగిందని తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తల్లి బిడ్డలు క్షేమంగా ఉన్నారని 108 సిబ్బంది చతురతను బాలింత కుటంబ సభ్యులు వారి సేవలను కొనియడుతూ ధన్యవాదాలు తెలిపారు.అనంతరం సిబ్బందిని గ్రామస్తులు అభినందించారు.

## శ్రీ శివ భక్త మార్కండేయ ఆలయ భూమి పూజచేసిన

### బోథ్ నియోజవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ అడే గజేందర్..

**ప్రజాపక్షం/బోథ్:**బోథ్ పట్టణ కేంద్రంలో శ్రీ శివ భక్త మార్కండేయ ఆలయ నిర్మాణానికి భూమి పూజ సోమవారం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి అడే గజేందర్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహంచి.ఆలయ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు.ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.ఆలయాలు మన సంస్కృతి,సంప్రదాయాలకు ప్రతీకలని,ప్రజల ఆధ్యాత్మికాభివృద్ధికి ఇలాంటి దేవాలయాలు ఎంతో అవసరమని తెలిపారు.ఆలయ నిర్మాణానికి తన వంతు సహకాం ఎల్లప్పుడు ఉంటుందని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కుర్మే అన్నపూర్ణ మహేందర్,బోథ్ బ్లాక్ ఆత్మ చైర్మన్ గొర్ల రాజు యాదవ్,పద్మశాలి సంఘం అధ్యక్షుడు మెరుగు బోజన్న యాదవ్,మాజీ ఎంపీటీసీ,ట్రాస్క్ డైరెక్టర్ చాట్ల ఉమేష్,మాజీ సర్పంచ్ మెరుగు దాస్,బారె నాగేందర్,యువ నాయకుడు సన్నీ రెడ్డి,గ్రామ పెద్దలు,భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థులను ప్రభుత్వం చిన్న చూపు చూస్తోంది

**ప్రజాపక్షం/జగిత్యాల:** ఎస్సి, ఎస్టి విద్యార్థులను కాంగ్రెస్ ప్రభుత్వం చిన్న చూపు చూస్తోందని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆరోపించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అవలంభిస్తున్న వ్యతిరేఖ విధానాలపై మాజీ మంత్రి తన గళం విప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిననాటి నుంచి ఎస్సి, ఎస్టి విద్యార్థులను గాలికి వదిలివేసిందన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఎస్టి బాలుర హాస్టల్‌లో కమాటి విద్యార్థులను చీపురుతో చితకబాదడం, మంచిర్యాల జిల్లా చెన్నూర్ సోషల్ వెల్ఫేర్ పాఠశాల చదువుచున్న విద్యార్థి మరణం వంటి సంఘటనలు జరుగడంపై ఈశ్వర్ ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్లక్ష్యానికి జగిత్యాల, చెన్నూరు ఘటనలు నిదర్శనమన్నారు. జగిత్యాల ఎస్టి హాస్టల్‌లో పనిచేస్తున్న కమాటి శ్రీనివాస్ మద్యం మత్తులో పడుకున్న విద్యార్థులను చితక బాదడం ఘటనపై అధికారులు పూర్తి విచారణ చేపట్టాలన్నారు. అధికారుల పర్యవేక్షణ లోపమే కారణమని మాజీ మంత్రి ఆరోపించారు. దళిత, ఆదివాసులకు పదవులు ఇచ్చాం అని చెప్పుకునే కాంగ్రెస్ ప్రభుత్వం గురుకులాల్లో చదువుతున్న ఎస్సి, ఎస్టి విద్యార్థులను ఎబిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో విద్యా వ్యవస్థను బలోపేతం చేసిన విషయాలను కొప్పుల ఈశ్వర్ ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఎస్టి, ఎస్టి విద్యార్థుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేయాలని డిమాండ్ చేశారు.

## వృద్ధాప్య పింఛన్ కోసం ప్రజావాణిలో వృద్ధురాలి వినతి

**ప్రజాపక్షం/మెట్‌పల్లి :** జగిత్యాల జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఓ వృద్ధురాలి ఆవేదన హృదయాలను కదిలించింది. జగిత్యాల జిల్లాకు చెందిన మెట్‌పల్లి మున్సిపల్ పరిధిలోని గాజులపేట 2వ వార్డు నివాసి పానుగంటి ఆశగంగు (87) తనకు వృద్ధాప్య పింఛన్ మంజూరు చేయాలని అధికారులను వేడుకున్నారు.ఆమె తెలిపిన వివరాల ప్రకారం,తాను వృద్ధాప్యంలో ఉన్నప్పటికీ ఇప్పటివరకు ప్రభుత్వ పింఛన్ అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. జీవనోపాధి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నానని, దైనందిన అవసరాలు కూడా తీర్చుకోవడం కష్టంగా మారిందని తెలిపారు. అవసరమైన అన్ని ధ్రువపత్రాలు ఉన్నప్పటికీ పింఛన్ మంజూరు కాకపోవడంతో పలుమార్లు సంబంధిత అధికారులను ఆశ్రయించినట్లు చెప్పారు. ఈ ఘటనతో ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు విషయంలో లోపాలు వెలుగులోకి వస్తున్నాయి. అర్హులైన వృద్ధులకు పింఛన్లు సకాలంలో అందేలా అధికారులు తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడుతున్నారు.

## జిపి సిబ్బందికి డ్రెస్ కోడ్

**ప్రజాపక్షం / వేలేరు :** గ్రామఅభివృద్ధికోసం అహర్నిషలు కృషిచేస్తున్న గ్రామపంచాయితీ సిబ్బందికి నాయొక్క నెలసరి వేతనం సైతం అందించడమేకాకుండా పాలనలో మార్పు కోసం గ్రామపంచాయితీ సిబ్బందికి నూతన డ్రెస్ కోడ్‌ను పాలక వర్గం ఆమోదంతో అమలు పరిచి సోమవారం నూతన డ్రెస్‌లను అందించిడం జరిగిందని వేలేరు గ్రామసర్పంచ్ బిల్ల యాదగిరి అన్నారు.ఈసంధర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామఅభివృద్ధిలో భాగస్వాములుగా నిలుస్తూ అహర్నిషలు గ్రామశ్రేయస్సు కోసం కృషిచేస్తున్న గ్రామ పంచాయితీ సిబ్బందికి నూతన డ్రెస్‌లను అందించడం జరిగిందని అన్నారు.కార్యక్రమంలో సర్పంచ్ బిల్ల యాదగిరి,ఉపసర్పంచ్ కోడూరి శ్రీకర్,గ్రామపంచాయితీకార్యదర్శి సంపత్‌కుమార్,వార్డు సభ్యులు, చైతన్య, సునీల్,జిపి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధిహామీ పనుల పరిశీలన

**ప్రజాపక్షం / వేలేరు :** వేలేరు మండలం లోని పీచర గ్రామంలో కొనసాగుతన్న జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం పనులను గ్రామసర్పంచ్ మరిజె అనితనర్సింగా రావు శుక్రవారం పరిశీలించారు.ఈసంధర్భంగా సర్పంచ్ ఉపాధిహామీ పనుల పురోగతిని సమీక్షించి కార్మికులతో మాట్లాడి వారికి కల్పిస్తున్న సౌకర్యాలపై వివరాలు తెలుసుకున్నారు.పనులు నాణ్యతతో పాటు,వేసవి కాలం సంధర్భంగా సమయ పాలన పాటించాలని కోరారు.కార్యక్రమంలో గ్రామపంచాయితీ కార్యదర్శి అనీల్ కుమార్ ఎపిఒ విజయ,కారోబార్ రాజు తదితరులు పాల్గొన్నారు.

## పోచమ్మ తల్లి దేవాలయ ముఖద్వార ప్రతిష్టాపన..

**ప్రజాపక్షం/నడికూడ :** హనుమకొండ జిల్లా నడికూడ మండలం కంఠాత్మకూర్ గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న పోచమ్మ తల్లి దేవాలయం దర్వాజా ప్రతిష్టపన పూజా కార్యక్రమం ఆచార్యలు అఖిల్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి,రాతి దర్వాజ దాత పల్లబోయిన మహేందర్ దంపతులు గ్రామ ప్రజా ప్రతినిధులు,గ్రామస్తులు ప్రత్యేక పూజలు పాల్గొని అమ్మవారి ఆశీస్సులు తీసుకున్నారు. గ్రామ పెద్దల ఆధ్వర్యంలో దేవాలయం ముఖ ద్వారా ప్రతిష్టాపన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో జరిగాయని, పోచమ్మ తల్లి గ్రామానికి రక్షణగా ఉంటుందని,గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని దేవాలయం నిర్మాణానికి దాతలు మరింతమంది ముందుకు వచ్చి భాగ్య సామ్యం కావాల్సిందిగా వారు కోరారు.గ్రామ పెద్దలు,మహిళలు పాల్గొన్నారు.

## జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతమే లక్ష్యం

**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) ఆదేశాల మేరకు, హనుమకొండ జిల్లా వ్యాప్తంగా పార్టీని క్షేత్రస్థాయి నుంచి పటిష్టం చేసేందుకు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి శ్రీకారం చుట్టారు. ఈ ప్రక్రియలో భాగంగా పాత కమిటీలను రద్దు చేసి, పారదర్శకంగా నూతన కమిటీలను ఎన్నుకునేందుకు నియమించబడిన అబ్జర్వర్లు కుందూర్ వెంకట్ రెడ్డి, పింగిలి వెంకట్ రెడ్డి, బిల్లా ఉదయ్ రెడ్డి, మదన్ గౌడ్, పి. సారంగపాణి గార్లతో కలిసి సోమవారం వర్ధన్నపేట నియోజకవర్గం, ఐనవోలు మండల నాయకులతో మ్యాంగో ఫార్మ్ స్టే రిసార్ట్, ఐనవోలులో స్థానిక శాసనసభ్యులు కె.ఆర్.నాగరాజు ప్రస్తుతం అసెంబ్లీ సమావేశాలలో బిజీగా ఉన్న నేపథ్యంలో, వారి సూచనల మేరకు, వారికి పూర్తి సమాచారం అందించి ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. పార్టీ పటిష్టత కోసం ఐనవోలు మండల స్థాయి కమిటీలను పారదర్శకంగా, క్రియాశీలక కార్యకర్తలతో భర్తీ చేయడంపై అబ్సర్వర్లతో కలిసి లోతుగా చర్చించి ఆశావాహుళ నుండి మండల కమిటీకి 51 దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా హనుమకొండ డిసిసి అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత మండల అధ్యక్షులు, సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, మాజీ ప్రజాప్రతినిధులు, సొసైటీ చైర్మన్లు మరియు సీనియర్ నాయకులందరితో చర్చించి, అందరి ఏకాభిప్రాయంతోనే సమర్థవంతమైన కమిటీలను ఎన్నుకుంటున్నాము. ప్రజా సమస్యలపై పోరాడే వారికే ఈ కమిటీల్లో చోటు ఉంటుంది, అని స్పష్టం చేశారు. అబ్జర్వర్లుగా నియమితులైన కుందూర్ వెంకట్ రెడ్డి, పింగిలి వెంకట్ రెడ్డి, బిల్లా ఉదయ్ రెడ్డి, మదన్ గౌడ్, పి. సారంగపాణి పర్యవేక్షణలో కమిటీల ఎంపిక ప్రక్రియ అత్యంత సమన్వయంతో సాగుతోందని, నూతన కమిటీల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు సముచిత ప్రాధాన్యత కల్పించడమే కాకుండా, మహిళలకు 30 శాతం ప్రాతినిధ్యం తప్పనిసరిగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మండల స్థాయి కార్యవర్గాల్లో 35 సంవత్సరాల పైబడిన, పార్టీ సిద్ధాంతాల పట్ల అవగాహన ఉన్న వారికే ప్రాధాన్యతనిస్తున్నట్టు, మండల అధ్యక్షులు, సభ్యులుగా కనీసం మూడు సంవత్సరాలు పార్టీలో చురుకైన పాత్ర పోషించిన వారినే ఎంపిక చేస్తున్నామని స్పష్టం చేశారు. జిల్లా పరిధిలో రెండు సంవత్సరాల పదవీకాలం పూర్తి చేసుకున్న మండల అధ్యక్షులను నిబంధనల ప్రకారం మారుస్తూ, కొత్త రక్తాన్ని నింపే ప్రయత్నం చేస్తున్నట్టు ఈ సందర్భంగా తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా, రాష్ట్ర స్థాయి నాయకులు, మండల ముఖ్య నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి దిష్టిబొమ్మ దగ్ధం



**ప్రజాపక్షం/ ఎల్కతుర్తి :** హుజురాబాద్ శాసనసభ్యుడు పాడి కౌశిక్ రెడ్డి స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే, కడియం శ్రీహరిపై అసెంబ్లీలో అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు తీవ్రంగా ఖండిస్తూ, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అంబాల శ్రీకాంత్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ కార్యకర్తలు ఎల్కతుర్తి మండల కేంద్రంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సర్కిల్ వద్ద కౌశిక్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు.కార్యకర్తలు రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ పరిస్థితిని ఉద్రిక్తంగా మార్చారు. వెంటనే ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డిపై చర్యలు తీసుకోవాలని, ఆయనను పదవి నుండి తొలగించాలని డిమాండ్ చేశారు.ఈ నిరసన కార్యక్రమంలో మండల అబ్జర్వర్ పెద్ది వెంకట్ నారాయణ గౌడ్, అశోక్ ముఖర్జీ, మార్కెట్ కమిటీ చైర్మన్ సంతాజి, మాజీ మండల అధ్యక్షులు ఇంద్రసేనారెడ్డి, మాజీ సొసైటీ డైరెక్టర్ ముప్పు మహేందర్, మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి వీరమల్లు, రంజిత్ రెడ్డి, మాజీ మండల ప్రధాన కార్యదర్శి గూడేల్లి నవీన్ కుమార్, మాజీ యూత్ మండల అధ్యక్షులు హింగే శ్రీకాంత్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జోజి రెడ్డి, రావుల రమేష్, ముప్పు శ్రీను, అంబాల స్వామి, శనిగరపు వెంకటేష్, డాక్టర్ బుల్లెపోగు రమేష్, అంబాల రమేష్ , గోడిశాల అర్జున్ గౌడ్, మాజీ వార్డ్ మెంబర్స్ వినయ్ గౌడ్, అంబాల యువరాజ్, కోరే పున్నాం, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కొత్తగూడెంలో పట్టా భూమిలో అక్రమ సర్వే..



**ప్రజాపక్షం/సంగెం:** మండలంలోని కొత్తగూడెం గ్రామంలో నిబంధనలకు విరుద్ధంగా పట్టా భూమిలో అక్రమ సర్వే నిర్వహించడం కలకలం రేపింది.గ్రామానికి చెందిన బాధితుడు బొంత బిక్షపతి తండ్రి.కొమురయ్య తన స్వంత పట్టా సర్వే నెంబర్ (309/బి) 0.10 గుంటల భూమి గవిచర్ల శివారులో కలదు.తనకు ఎటువంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా,తన అనుమతి లేకుండా కొందరు వ్యక్తులు దౌర్జన్యంగా ప్రవేశించి మండల సర్వేయర్ కాని వ్యక్తి తో సర్వే నిర్వహించారని ఆరోపించారు.ఈ సందర్భంగా విలేకర్ల సమావేశంలో బాధితుడు బొంత బిక్షపతి మాట్లాడుతూ..నా స్వంత పట్టా భూమిలో నాకు తెలియకుండా సర్వే చేయడం చట్టవిరుద్ధమని భూమికి సంబంధించిన అన్ని రికార్డులు(పట్టాదారు పాస్ బుక్,పహాణీ) తన పేరిట స్పష్టంగా ఉన్నప్పటికీ, కొందరు కావాలనే నా హక్కులకు భంగం కలిగించేలా ప్రవర్తిస్తున్నారని,ప్రభుత్వ నిబంధనల ప్రకారం పట్టా భూమిలో సర్వే చేయాలంటే యజమానికి నోటీసు ఇవ్వాలి,కానీ ఇక్కడ అవేవీ పాటించకుండా దొంగచాటుగా సర్వే నిర్వహించారని అన్నారు.ఈ అక్రమ సర్వేపై ఇప్పటికే అధికారులకు రాతపూర్వక ఫిర్యాదు చేయడం జరిగిందని తెలిపారు. అధికారులు తక్షణమే స్పందించి,తన భూమిలోకి అక్రమంగా ప్రవేశించిన వారి పై వారికి సహకరించిన వారి పై కఠిన చర్యలు తీసుకోని న్యాయం చేయాలని కోరారు.ఇలాంటి అక్రమ చర్యల వల్ల గ్రామంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగే అవకాశం ఉందని,అధికారులు వెంటనే విచారణ జరపాలని వేడుకున్నారు.

## కాంగ్రెస్ మండల అధ్యక్ష పదవికి దరఖాస్తుల స్వీకరణ

**ప్రజాపక్షం /ఎల్కతుర్తి :** హనుమకొండ జిల్లా వ్యాప్తంగా ఇటీవలే మండల స్థాయి పదవులను రద్దు చేసి విషయం తెలిసిందే. కాంగ్రెస్ పార్టీ హనుమకొండ జిల్లా ఇనగాల వెంకటరామ్ రెడ్డి ఆదేశాల మేరకు నూతన నియామకాలకు దరఖాస్తులను ఆహ్వానించిన సందర్భంగా సోమవారం ఎల్కతుర్తి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్ష పదవికి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో మండల అబ్జర్వర్లు పెద్ది వెంకటనారాయణ గౌడ్ అశోక్ ముఖర్జీ సమీక్షలో అభ్యర్థుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. మండల పరిధిలోని వివిధ గ్రామాల నుండి మొత్తం 20 మంది అభ్యర్థులు తమ దరఖాస్తులను సమర్పించారు. ఈ సందర్భంగా అభ్యర్థులు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్ష పదవి ఎవరికి కేటాయించినా పార్టీ నిర్ణయాన్ని గౌరవిస్తూ ఐక్యంగా పనిచేసి పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని తెలిపారు.అలాగే రాబోయే ఎంపీటీసీ, జెడ్పిటిసి ఎన్నికల్లో మండలంలో కాంగ్రెస్ జెండాను ఎగరవేయడం లక్ష్యంగా తీసుకుని సమిష్టిగా కృషి చేస్తామని అబ్జర్వర్లకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, గ్రామ స్థాయి నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## మార్పే లక్ష్యంగా ఎన్ఎస్ఎస్ సేవలు

**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** జాతీయ సేవా పథకం కార్యకర్తలంతా సామాజిక సేవే పరమావధిగా పని చేయాలని సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల వరంగల్ వెస్ట్ ప్రిన్సిపాల్ డాక్టర్ గోలి శ్రీలత అన్నారు. హనుమకొండ న్యూశాయంపేట పరిధిలోని జిపిఎస్ పోచంపల్లిలో నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఇనుగాల రాధికతో కలిసి ప్రిన్సిపాల్ డాక్టర్ గోలి శ్రీలత మాట్లాడారు. సామాజిక సేవతోనే పరిపూర్ణ పౌరులుగా ఎదుగుతారని సమాజ మార్పు కోసం విద్యార్థులు కృషి చేయాలని కోరారు. విద్యతోపాటు సామాజిక సేవా కార్యక్రమాల్లో విద్యార్థులు పాల్గొనడం ఆహ్వానించదగిందన్నారు.అలాగే జిపిఎస్ హెచ్ ఉప్పలయ్య మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే సేవాభావాన్ని అలవర్చుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సోనీ,శ్రీ విద్యా, పూజ శ్రీ సౌమ్యశ్రీ,త్రివేణి,పూర్ణిమ పాల్గొన్నారు.

## జిల్లాస్థాయి స్పోర్ట్స్ స్కూల్ సెలక్షన్స్ ప్రారంభం

**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** హనుమకొండలో జిల్లా స్థాయి స్పోర్ట్స్ స్కూల్ సెలక్షన్ ప్రక్రియ ఘనంగా ప్రారంభమైంది. ఉమ్మడి వరంగల్ జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు అజీజ్ ఖాన్ ముఖ్య అతిథిగా హాజరై సెలక్షన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీయడమే ఈ ఎంపికల ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. రెండు రోజుల పాటు నిర్వహించనున్న ఈ సెలక్షన్లలో మొదటి రోజు సోమవారం ఏడు మండలాలకు చెందిన విద్యార్థులు పాల్గొనగా, మంగళవారం మరో ఏడు మండలాల క్రీడాకారులు తమ ప్రతిభను చాటుకోనున్నారు.ఇన్‌చార్జ్ డివైఎస్ఓ శ్రీమన్నారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో క్రీడాకారులకు పారదర్శకంగా ఎంపికలు జరుగుతాయని చెప్పారు. ఇందులో ప్రతిభ చూపిన విద్యార్థులను ఎంపిక చేసి హైదరాబాద్ హకింపేటలో జరిగే రాష్ట్రస్థాయి సెలక్షన్స్ పంపుతామని చెప్పారు. అలాగే స్పోర్ట్స్ స్కూల్స్ లో ప్రత్యేక శిక్షణ, మెరుగైన వసతులు కల్పించనున్నట్లు తెలిపారు. స్థానిక క్రీడాభిమానులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో హాజరై విద్యార్థులను ప్రోత్సహించారు. కోచ్ లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బాల సముద్రంలో చలివేంద్రం ఏర్పాటు

**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** పాదాచారుల దాహార్థి తీర్చాలనే సంకల్పంతో ఉచిత త్రాగునీటి సౌకర్యం కల్పించినట్లు ప్రముఖ సీనియర్ జర్నలిస్టు, ప్రెస్ క్లబ్ మాజీ అధ్యక్షుడు పిన్న శివ కుమార్ తెలిపారు. సోమవారం హనుమకొండ బాలసముద్రంలో స్వచ్ఛందంగా చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.ఈ సందర్భంగా ఎండ తీవ్రత వల్ల బాటసారులు, ప్రయాణీకులు ఇబ్బందులకు గురికాకుండా దాహాం తీర్చేందుకు ముందుకువచ్చిన వ్యాపారవేత్త సత్యనారాయణ రెడ్డి,చోల్లేటి శ్రీధర్, పాత్రికేయులు ఉళ్ళెంగుల మహేష్ లకు కృతజ్ఞతలు చెప్పారు.ఈ చాలివేంద్రాన్ని అందరూ ఉపయోగించుకోవాలని కోరారు.ప్రొఫెసర్ మందపల్లి కిష్టయ్య,భూపతి రాజన్న తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి సంవత్సరం ఆపరేషన్ స్మైల్,ఆపరేషన్ ముస్కాన్

**ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్ :** చదువుకునే పిల్లల్లో ఆనందాన్ని చూడొచ్చుని వరంగల్ సీపీ సన్ ప్రీత్ సింగ్ తెలిపారు. సోమవారం ఫోర్ట్ వరంగల్ మండలంలోని గుంటూరు పల్లి మండల ప్రాథమిక పాఠశాలలో యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ వరంగల్ పోలీస్ కమిషనరేట్, ఎఫ్ఎంఎం సాంఘిక సేవా సంస్థ ఆధ్వర్యంలో ఇటుక బట్టీలలో పనిచేస్తున్న వలస కార్మికుల పిల్లలకు కమిషనర్ చేతుల మీదుగా ఎడ్యుకేషనల్ సామాగ్రి, యూనిఫార్మ్స్ పంపిణీ కార్యక్రమం పాఠశాల ప్రధానోపాధ్యాయులు విద్యాసాగర్ అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ యొక్క కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన వరంగల్ పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఆపరేషన్ స్మైల్, ఆపరేషన్ ముస్కాన్ అనేది పోలీసు, వివిధ ప్రభుత్వ అధికారుల సమన్వయంతో జరుగుతుందని ఆ యొక్క కార్యక్రమంలోనే భాగంగా స్కూలు బయట ఉన్న పిల్లలందరినీ గుర్తించి తప్పనిసరిగా స్కూల్లో చేర్పించాల్సిన అవకాశం ఉందని తెలిపారు. ఈ పిల్లలకు సరైన విద్య అందుటకు కు ప్రత్యేకమైన టీచర్స్ ను, యూనిఫాం, బుక్స్ బ్యాగులు, ఎఫ్ఎంఎం సాంఘిక సేవా సంస్థ సహకారంతో ఇప్పించడం జరుగుతుందని ఇందుకుగాను నేను పోలీసు విభాగాన్ని ఆంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ విభాగాన్ని, ఎఫ్ఎం సాంఘిక సేవా సంస్థ వారిని అభినందిస్తున్నానని అన్నారు.ఈ కార్యక్రమంలో వరంగల్ ఈస్ట్ జోన్ డిసిపి అంకిత్ కుమార్ మాట్లాడుతూ పిల్లల రక్షణ సంరక్షణ విషయంలో అందరం సమన్వయంతో కలిసి పనిచేయాలని సూచించారు. ఈ యొక్క కార్యక్రమంలో నందు అడిషనల్ డీసీపీ ఎన్. రవి మాట్లాడుతూ ఇటుక బట్టీలో ఓనర్లు గాని ఇతరులు గాని ఎవరైనా పిల్లల్ని పనిలో పెట్టుకున్నట్లైతే జీవనల్ జస్టిస్ యాక్టివ్, ఇతర చట్టాల ప్రకారం శిక్ష పడుతుందని సూచించారు .ఈ యొక్క కార్యక్రమంలో మామునూరు ఏసిపి వెంకటేష్, ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ ఇన్స్పెక్టర్ జే.శ్యాంసుందర్,ఎస్సై సుధాకర్ గుంటూరు పల్లి సర్పంచి శ్రీకాంత్, ఉపసర్పంచి దండ నరేష్ ఎఫ్ఎంఎం సాంఘిక సేవా సంస్థ డైరెక్టర్ సిస్టర్ సహాయ,గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొనడం జరిగింది.